
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 29.04.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 48 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# సేవ్.. వైకాపా!

## ఎమ్మెల్యేలను నిలబెట్టుకోకుండా ఢిల్లీలో తిరిగితే ఏం లాభం



**ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు అత్యంత వికృతంగా తయారయ్యాయి. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు వరుసబెట్టి తెలుగుదేశంలో చేరుతున్నారు. చంద్రబాబు అభివృద్ధిని చూసి ఆనందం తట్టుకోలేక తెలుగు దేశంలో చేరుతున్నామని వీళ్లందరూ చెప్పుకుంటున్నా, విని చప్పట్లు కొట్టేంత అమాయక స్థితిలో ప్రజలు లేరు.**

ఎమ్మెల్యేలు పార్టీ ఎందుకు మారుతున్నారన్నది ప్రజలకు బాగానే తెలుసు. పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలను గురించి పబ్లిక్‌లో ప్రజలు ఏమని మాట్లాడుకుంటున్నారో వింటే... ఆత్మాభిమానం ఉన్నవాళ్లెవరైనా గుండె ఆగి ఛస్తారు. అంత నీచంగా తిడు తున్నారు. దేవంగుడి ఆదినారాయణరెడ్డి, భూమా నాగిరెడ్డిలతో మొదలైన వలసల పర్వం ఇప్పుడు గొట్టిపాటి రవికుమార్ దాకా వచ్చింది. అయితే ఇది ఇక్కడితో ఆగేటట్లు లేదు. ఈ పరంపర ఇంకా కొనసాగేటట్లే వుంది. ఎమ్మెల్యేల కొనుగోలుకు తెరతీయడం ద్వారా చంద్రబాబు ఒక విష సంస్కృతికి శ్రీకారం చుడితే... ప్రతిపక్ష నేతగా జగన్ నాయకత్వ లోపం కూడా ఫిరాయింపులను ప్రోత్సహించేదిగా వుండడం విచారకరం.

'సేవ్ డెమోక్రసీ' అంటూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి తన పార్టీ నాయకులను వెంట బెట్టుకుని ఢిల్లీ అంతా కలతిరిగాడు. రాజనాథ్‌సింగ్, సీతారాం ఏచూరి, శరద్‌పవార్, శరద్‌యాదవ్ వంటి జాతీయ నాయకులను కలిశాడు. చంద్రబాబు అవినీతిపై ముద్రించిన 'అవినీతి చక్రవర్తి' పుస్తకాలను ఢిల్లీలో పంచిపెట్టాడు. ఏపిలో జరుగుతున్న ఎమ్మెల్యేల బేరసారాలను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకురావడంలో జగన్ కొంత సఫలమైనట్లే! ఏపిలో హోల్‌సేల్‌గా ఎమ్మెల్యేలను కొంటున్నారనే విషయం వారికీ అర్ధమైపోయింది. అయితే ఎవరు కూడా దీనిలో వేలుపెట్టి ఆపే పరిస్థితి, అవసరం లేదు కూడా!

చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమంటే ఇదే! జగన్ 'సేవ్ డెమోక్రసీ'కి ముందు 'సేవ్ వైకాపా' ఆపరేషన్ చేపట్టి వుంటే బాగుండేది. తన పార్టీ ఎమ్మెల్యేలతో నిత్యం టచ్‌లో వుంటూ, ఎవరన్నా పార్టీ మారే వాతావరణం కనిపించినప్పుడు వారితో చర్చించి ఉంటే బాగుండేది. అవతల ప్రలోభాల ప్రభావం చాలా తీవ్రంగా వుండి, అయస్కాంతంలా ఆకర్షిస్తున్నప్పుడు బలహీనమైన మనసున్న ఎమ్మెల్యేలను కట్టడి చేయడం చాలా కష్టమే! అలాంటి బలహీన లక్షణాలున్న ఎమ్మెల్యేలను కనిపెట్టి వారిని దారిలోకి తెచ్చుకుని వుండాలి. భూమా నాగిరెడ్డి పిఏసి ఛైర్మెన్ పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆ పదవిని కాపు వర్గానికి చెందిన జ్యోతుల నెహ్రూకు ఇచ్చి వుండాలి. వైకాపాకు దక్కే ఒక్క రాజ్యసభ స్థానాన్ని విజయసాయిరెడ్డి కోసం ఎత్తిపెట్టామని

(మిగతా 11వ పేజీలో)

## వలసల వరుసలో...

## నెల్లూరు నుండి ఎవరు?



రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైకాపా నుండి తెలుగుదేశంలోకి జోరుగా వలసలు సాగుతున్నా నెల్లూరుజిల్లా ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటివరకు కాస్త గట్టిగానే నిలబడ్డారని చెప్పొచ్చు.

(మిగతా 11వ పేజీలో)







## ఏ రెడ్డిని వరిస్తుందో?

### మంత్రి వర్గం నుండి నారాయణ ఔట్?

రాష్ట్ర కేబినెట్ విస్తరణ పలువురు నాయకులను ఊరిస్తోంది. ఆశావాదు లను పెంచుతోంది. ముఖ్యంగా విస్తరణలో నెల్లూరుజిల్లా నాయకులకు అవ కాశాలు ఎక్కువగా వున్నాయి. ఎందుకంటే మంత్రివర్గం నుండి నారాయణను తప్పించి, ఆయనను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా చంద్రబాబు నియమించవచ్చునని సమాచారం. అంటే మంత్రికన్నా కూడా ప్రాధాన్యత కలిగిన పోస్టు. దివంగత నేత వై.యస్. రాజశేఖరరెడ్డి హయాంలో కె.వి.పి. రామచంద్రరావు నిర్వహించిన పదవి అన్నమాట.

(మిగతా 11వ పేజీలో)



# అక్రమ రవాణాకు సాంకేతిక సంకెళ్లు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి కాంతారావు, పక్కన ఎస్పీ విశాల్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని ఎర్రచందనం అక్రమ రవాణాకు బ్రేక్ వేయనున్నట్లు టాస్క్‌ఫోర్స్ డిఐజి యం.కాంతారావు తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీన నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టడానికి పోలీసులు, అటవీశాఖాధికారులు సమన్వయంతో పని చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని బదలాయించుకోవాలని చెప్పారు. ఇకముందు ఫింగర్ ప్రింట్ అనాలసిస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అటవీశాఖాధికారులు పొందడం ద్వారా 'రెడ్ శాండల్స్ టాస్క్ ఫోర్స్' మరింత బలోపేతం కానున్నదని వెల్లడించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో రిపీటర్ స్మగ్లర్లకు చెక్ పెట్టవచ్చునన్నారు. ముద్దాయిలు, అనుమానిత వ్యక్తులను పట్టుకున్నప్పుడు వారి వద్ద నుండి ఫింగర్‌ప్రింట్ సేకరణ కంపారిజన్, డేటా స్టోరేజ్ చేయడం వంటి విధానం పోలీసుల వద్ద వుందని, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనున్నామన్నారు. దీని ద్వారా ఎర్రచందనం స్మగ్లర్లపై నిఘా పెట్టి, 'క్రిమినల్ ట్రాకింగ్ సిస్టం'కు అనుసంధానం చేసి దేశంలో వారెక్కడున్నా గుర్తించగలమని డిఐజి చెప్పారు. ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టడంలో మంచి ఫలితాలు సాధిస్తున్న ఎస్పీ విశాల్‌గున్నిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఎస్పీ విశాల్‌గున్ని, ఏఎస్పీ శరత్‌బాబులు కూడా పాల్గొన్నారు.

### వైభవంగా ముగిసిన

# శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



జనసందోహం మధ్య రథోత్సవం

వింజమూరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుండి 25వ తేదీ వరకు వైభవంగా జరిగాయి. 17వ తేదీ అంకురార్పణ, 16వ తేదీ రాత్రి సోమిశెట్టి శేషారావు ఉభయకర్తలుగా ధ్వజారోహణ, శేషవాహనం, 19వ తేదీ కొత్తూరు భక్తులు ఉభయకర్తలుగా పొన్నవాహనోత్సవం, 20వ తేదీ పాతూరు భక్తులచే హనుమంత సేవ, 21వ తేదీ నడిమూరు భక్తులచే గరుడసేవ, 22వ తేదీ యర్రబల్లిపాలెం భక్తులచే కళ్యాణోత్సవం అత్యంత వేడుకగా జరిగాయి. 23వ తేదీ శ్రీ స్వామివారి రథోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఉదయం 11గంటలకు మొదలైన రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం నుండి మొదలైన రథోత్సవం పాతూరులోని గంగమిట్ట వరకు సాగి తిరిగి దేవస్థానంకు చేరుకుంది. కలిగిరి సిఐ సాంబశివరావు, వింజమూరు ఎస్‌ఐలు బందోబస్తు పర్యవేక్షించారు. 24వ తేదీ దరిశి చలమయ్య ఉభయకర్తగా పారువేట, 25వ తేదీ వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

సింహపురి సమాచారం

# నేత్రదానం



శుభమస్తు షాపింగ్‌మాల్ మేనేజర్, కందుకూరు వాస్తవ్యుడు పేటేటి సూర్యతేజ ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన తండ్రి పేటేటి మల్లిఖార్జున కోరికమేరకు శుభమస్తు ఫౌండేషన్, అర్బన్ ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డా॥ పిఎల్ రావు పర్యవేక్షణలో టెక్నీషియన్ యండిబి ప్రసాద్ సూర్యతేజ నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో నేత్రదాన కమిటీ ఛైర్మెన్ బయ్యాప్రసాద్, పేటేటి మల్లిఖార్జున, పేటేటి కిరణ్, బయ్యా వాసు, జెవిఆర్ మురళి, శ్రీనివాస రాణాప్రతాప్, శుభమస్తు షాపింగ్‌మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

### మురళీమోహన్‌రాజుకు

# అంబేద్కర్ సేవా పురస్కారం




సహజ సాహితీ సాహిత్య సాంస్కృతిక సంస్థ చీరాల వారి ఆధ్వర్యంలో సోమవారం చీరాలలోని విద్యా కళాశాల సెమినార్‌హాల్‌లో రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాలలో కృషి చేస్తున్న వ్యక్తులకు పురస్కారం అందజేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన అభ్యుదయ రచయిత రాచపాలెం రఘు, కె.మురళీమోహన్‌రాజులకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవా పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

# సీతారామ కళ్యాణ మహోత్సవం



కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్లో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రిని, నూర్‌బాషా ముస్లిం సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ కాలేషాను సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు పర్యవేక్షించారు.

## సేద్యంలో వైద్యం చేసిన

# డాక్టర్ వెంకురెడ్డికి జీవనసాఫల్య పురస్కారం



వ్యవసాయ రంగంలో చేసిన విశేష కృషికి గాను నెల్లూరుజిల్లా వాకాడు వాసి, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త సర్వారెడ్డి వెంకురెడ్డిని జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఇటీవల హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో వ్యవసాయ విస్తరణ నిపుణుల సంఘం, సర్వారెడ్డి వెంకురెడ్డి డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'విస్తరణ శాస్త్రవేత్తల కలయిక' సమావేశంలో వెంకురెడ్డితో పాటు ప్రపంచ ఆహార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ గుస్టాఫ్‌సన్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సి.ప్రసాద్‌లను కూడా జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించారు.

వాకాడుకు చెందిన సర్వారెడ్డి వెంకురెడ్డి వ్యవసాయ రంగంలో ఎన్నో పరిశోధనలు చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్‌లో వ్యవసాయ శిక్షణా కేంద్రాలను నెలకొల్పి ఆధునిక సేద్యానికి బాటలు వేశారు. కొంతకాలం ప్రపంచ బ్యాంకులోనూ పనిచేశారు. ఆయన తండ్రి వరదారెడ్డి వాకాడు మండలంలోనే గొప్ప వ్యవసాయవేత్త. మాజీ డీసీసీబీ ఛైర్మన్ స్వర్గీయ వేమారెడ్డి రామచంద్రారెడ్డి అల్లుడే వెంకురెడ్డి. ప్రతిక్షణం సేద్యంలోనే సేద తీరుతూ సేద్యంలో వచ్చే సమస్యలకు వైద్యం చేస్తూ, వ్యవసాయాన్ని ఆధునిక పరిజ్ఞానం వైపు మళ్ళించేందుకు కృషి చేస్తున్న వెంకురెడ్డి లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డునందుకున్న సందర్భంగా 'లాయర్' అభినందనలు.

# జిల్లాకు 15వేల బోర్లు



ఎన్‌టిఆర్ జలసిరి ఫేస్-2 క్రింద జిల్లాకి 15వేల 229బోరు బావులు ప్రభుత్వం కేటాయించిందని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎన్.టి.ఆర్. జలసిరి ఫేస్-2 అమలు గురించి అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.టి.ఆర్. జలసరి ఫేస్-2 క్రింద బోర్ వెల్స్ కొరకు జిల్లా వ్యాప్తంగా 10వేల 57 ధరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటికే గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ క్లియర్ చేసిన వాటికి రేపటి నుండి బోర్ వెల్స్ వేసే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

డ్వామా పి.డి శ్రీమతి హరిత మాట్లాడుతూ, ప్రభుత్వం ఒక బోర్‌వెల్ యూనిట్ ఖరీదు లక్షా 19వేల రూపాయలుగా నిర్ణయించినట్లు తెలియజేశారు. ఇంకా ఎవరైనా రైతులు ధరఖాస్తు చేసుకోకున్నట్లైతే, ఇప్పుడు కూడా ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో జియోలజిస్టుల కొరత ఉందని, కొంతమందిని అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల నుండి రప్పిస్తున్నట్లు ఆమె తెలియజేశారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి యం.సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రజాపరిషత్ సిఇఓ బి.రామిరెడ్డి, గ్రౌండ్‌వాటర్ డిడి రమేష్‌కుమార్, నెడ్‌క్యాప్ డియం హరినాథ్‌బాబు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఏప్రిల్ 24వ తేదీన నెల్లూరు ఇందిరాభవన్‌లో జరిగిన కాంగ్రెస్‌పార్టీ అనుబంధ సంఘాల సదస్సులో కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షులు కొప్పుల రాజును సన్మానిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి...

# సింహద్వారం శ్రీ సిటీయే!

- మోండెలేజ్, ఇసుజు పరిశ్రమలను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు







రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో శ్రీసిటి సెజ్ ప్రధానపాత్ర పోషిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఏప్రిల్ 25వ తేదీన శ్రీసిటీలో నెలకొల్పిన మోండెలేజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి క్యాడ్‌బరి చాక్లెట్ల పరిశ్రమను, అలాగే ఏప్రిల్ 27వ తేదీన ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను ముఖ్యమంత్రి చంద్రబాబు తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఒక్కరోజు గ్యాప్ ఇచ్చి రెండు రోజులు సీఎం శ్రీసిటీకి రావడం చూస్తుంటే రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి, పెట్టుబడులను ఆకర్షించడానికి శ్రీసిటి ఒక వేదికగా మారింది, ఆ ప్రాధాన్యతను ముఖ్యమంత్రి గుర్తించారు. రెండురోజులు శ్రీసిటీకి వచ్చిన చంద్రబాబుకు శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డిలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు తన ప్రసంగంలో ప్రపంచ స్థాయి సదుపాయాలలో శ్రీసిటీ దేశంలోనే అత్యుత్తమ సెజ్‌గా రూపొందుతుందని కితాబిచ్చారు. శ్రీసిటీకి మరిన్ని పరిశ్రమలు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీలో నెలకొల్పుతున్న పరిశ్రమల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, మున్సిపల్ మంత్రి నారాయణ, ఢిల్లీలో ఏ.పి.ప్రభుత్వ ప్రతినిధి కంభంపాటి రామ్మోహన్‌రావు, చిత్తూరు కలెక్టర్ సిద్ధార్థజైన్, ఏపిఐఐసి ఛైర్మన్ కృష్ణయ్య, ఆయా పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

# జెఇఇ మెయిన్స్‌లో విశ్వసాయి విజయం

బుధవారం ప్రకటించిన జెఇఇ మెయిన్స్‌లో విశ్వసాయి జూనియర్ కళాశాలకు చెందిన 13మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ఎన్నికయ్యారు. విద్యార్థుల నిరంతర కృషి, అధ్యాపకుల పర్యవేక్షణ ఈ విజయాలకు కారణమని విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మన్ డా॥ యన్.సత్యనారాయణ తెలిపారు. ఈ విజయాలను సాధించిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. మేము రూపొందించి, అవలంబిస్తున్న 5స్టెప్ ప్రోగ్రామ్ ద్వారా బైపిసిలోనే కాక ఎంపిసిలో కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నామని విద్యాసంస్థల వైస్‌ఛైర్మెన్ కృష్ణమోహన్ చెప్పారు. విజయాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.


ఉత్తరక్రియలు



జననం: 24.9.1922

మరణం: 25.04.2016

మా ఇంటి దైవం

శ్రీ తిక్కవరపు కోదండరామిరెడ్డి గారు
(ఇంజనీర్)

తే. 25.04.2016ది స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: తిక్కవరపు సీతారత్నమ్మ
మరియు కుటుంబసభ్యులు

దశదిన కర్మ: తేది.5-5-2016 ఉ॥ 9.00 గంటలకు నెల్లూరు, లక్ష్మీపురం, డోనెం.3/334 నందలి మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

ఫోన్: 0861 - 2323662, సెల్: 98480 27881

# 'ప్రభా'తం

ఇది అందరికీ తెలిసిన సమస్యే. ఏళ్ళ తరబడిగా ఎలాంటి పరిష్కారానికీ నోచుకోని సమస్య. అయినా, ఇదేమీ మామూలు సమస్య కాదు. ఎంతోమంది కక్షిదారుల జీవితాలతో ముడిపడివున్న సమస్య. ఒకవైపు రోజురోజుకు సమాజంలో నేరప్రవృత్తి పెరిగిపోతూ కేసుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుంటే, మరోవైపు ఆ కేసుల్ని పరిష్కరించాల్సిన న్యాయమూర్తుల సంఖ్య మాత్రం ఏళ్ళ తరబడిగా పెరగకుండా వుంటే..పెండింగ్ కేసులు కట్టలు కట్టలుగా పేరుకుపోతూనే వుంటాయన్నది ఎవరికైనా అర్థమయ్యే విషయమే. అయితే, ఈ పరిస్థితికి న్యాయవ్యవస్థో లేదా న్యాయమూర్తులో కారణమని ఎవరైనా అనుకున్నా, లేదా వారిపైనే భారం మోపాలని అనుకున్నా అది ఎంతమాత్రం సరైనదీ కాదు..సమంజసమైనదీ కాదు. కోర్టుల్లో పెండింగ్ కేసులు పేరుకుపోతున్నా, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన న్యాయమూర్తులను ప్రభుత్వం నియమించకపోవడమే విచారకరం. పెరుగుతున్న కేసులకు అనుగుణంగా న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలని ఎప్పటినుంచో కోరుకుంటున్నా, అప్పట్లో ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్లే చివరికి పెండింగ్ కేసులు ఇప్పుడు మరింత భారీగా పేరుకుపోతూనే వున్నాయి. ఇప్పటికైనా ఈ పరిస్థితి మారాలని ఇటీవల ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల సదస్సులో భారత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఠాకూర్ ఆకాంక్షించారు. ఈ పరిస్థితి వివరిస్తూ ఆయన తన ప్రసంగంలో ఒకటిరెండు చోట్ల భావోద్వేగానికి గురై కంటతడిపెట్టారు కూడా. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో వున్న అత్యున్నత న్యాయస్థానానికి అధిపతిగా వున్న ప్రధాన న్యాయమూర్తి కంటతడి పెట్టడం దేశాన్నే కలవరపరిచే విషయం. ఈ దేశ చరిత్రలో ఇలాంటి సంఘటన ఇంతవరకూ జరిగివుండదు. ఈ సదస్సులో ప్రధాని నరేంద్రమోడీ కూడా వున్నారు. పెండింగ్ కేసులు భారీగా పెరిగిపోతున్నాయని, న్యాయవ్యవస్థ తలకు మించిన భారాన్ని మోస్తోందని భారత ప్రధాన న్యాయమూర్తి ఈ సందర్భంగా గద్గద స్వరంతో తన ఆవేదన వినిపించారు. ప్రస్తుతం వున్న న్యాయమూర్తుల సంఖ్యను 21వేల నుంచి 40 వేలకు పెంచాల్సిన అవసరాన్ని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని కూడా ఆయన ఆవేదనగా అన్నారు. 1987 నుంచి ఇదే పరిస్థితి వుందని, న్యాయమూర్తుల సంఖ్యను పెంచకపోవడంతో పెండింగ్ కేసులు కొల్లలుగా వుంటున్నాయని గణాంకాలతో సహా వివరించారు. ప్రధాని సానుకూలంగా స్పందించి పెండింగ్ సమస్యల పరిష్కారానికి అందరి కలసి కృషిచేద్దామని భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా దాదాపు మూడు కోట్ల కేసుల దాకా పెండింగ్‌లో వున్నట్లు ఒక అంచనా. హైకోర్టుల వద్ద 38 లక్షల దాకా కేసులు పెండింగ్‌లోనే వున్నాయి. అదేవిధంగా, అన్ని కోర్టుల్లోనూ ఆమోదించిన న్యాయమూర్తుల పోస్టుల సంఖ్య 21,301 వుండగా, ప్రస్తుతం 16,238 మంది న్యాయమూర్తులే వున్నారని, ప్రస్తుతం దేశ జనాభా ప్రకారం న్యాయమూర్తుల సంఖ్య 40 వేలైనా వుండాలని ప్రధాన న్యాయమూర్తి ప్రసంగం సారాంశం. తాను చేసిన ఈ భావోద్వేగపూరిత విజ్ఞప్తి వల్ల న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెడుతుందనే ఆశాభావాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు. అందుకు వెంటనే ప్రధాని మోడీ స్పందించడం, ఆ సమస్యకు తగ్గ పరిష్కారాలు వెదుకుదామని చెప్పడం శుభపరిణామమేనని అనుకోవచ్చు. భారత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఠాకూర్ పేర్కొన్న అంశానికి ప్రధాని సానుకూలంగా స్పందిస్తూ, "ఆయన బాధను నేను అర్థం చేసుకోగలను. 1987 నుంచి ఇప్పటికి ఎంతో కాలం గడిచింది. ఇలా జరగడానికి కారణమేమైనా కావచ్చు. అసలు ఎప్పటికీ జరగకపోవడం కన్నా, ఆలస్యంగానైనా జరగడం మేలు"..అని ఆ సమస్యకు పరిష్కారం చూపేందుకు హామీ ఇవ్వడం అందరికీ ఆనందం కలిగించిందనే చెప్పవచ్చు. అంతేకాదు, రాజ్యాంగపరమైన అవరోధాలతో సమస్యలేమీ రాకుంటే, ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు సీనియర్ మంత్రులు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు అంతరంగికంగా సమావేశం కావచ్చని, ఏదేమైనా సామాన్యులకు న్యాయవ్యవస్థపై విశ్వాసం కొనసాగేలా చూడడం అందరి బాధ్యత అని, ఆ బాధ్యతను ప్రభుత్వం నిర్వర్తిస్తుందని ప్రధాని ఈ సందర్భంగా ఎంతో చిత్తశుద్ధితో స్పష్టం చేయడం అందరినీ మెప్పించేలా చేసింది. ఈ సందర్భంగా, పేరుకుపోతున్న సమస్యల పరిష్కారానికి ఈ సదస్సు పలు నిర్ణయాలు తీసుకుంటూ తీర్మానం చేయడంతో ఆ సమస్యల పరిష్కారానికి ఒక ముందడుగు పడినట్లేనని అనుకోవచ్చు. పదవీ విరమణ చేసిన న్యాయాధికారులను తాత్కాలిక న్యాయమూర్తులుగా నియమించడానికి రాజ్యాంగంలోని నిబంధనను ఉపయోగించుకోవాలనే తీర్మానాన్ని సదస్సు ఆమోదించడం ఇందుకు ఎంతైనా ఉపకరిస్తుందని భావించవచ్చు. ఈ నేపథ్యంలో కిందికోర్టుల్లో ఖాళీలు భర్తీ చేయడానికి కూడా తగు చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదేమైనా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిఎస్ ఠాకూర్ భావోద్వేగపూరిత ప్రసంగం పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున సత్వర చర్యలు తీసుకునేందుకు ఒక ప్రేరణగా నిలిచిందనే అనుకోవచ్చు. అప్పటికప్పుడు ప్రధాని మోడీ స్పందించి ప్రసంగించిన తీరు అందరినీ ఆకట్టుకుంది కూడా. అదే సందర్భంలో న్యాయవ్యవస్థలోని సమస్యలూ తప్పని సరిగా పట్టించుకోవాల్సినవే. అయితే, గత కాలంలో ప్రభుత్వాలు ఏళ్ళ తరబడి నిష్క్రియాపరత్వంగా వుండడంతో ఈ కేసులు ఇప్పుడు కొండల్లా పెరిగిపోతుండడం ఎంతైనా బాధాకరం. ఇకనైనా వీటికి తగు పరిష్కారం దొరుకుతుందని, గతంలోని తీరు మారుతుందనే భావిద్దాం. అటు ప్రభుత్వం, ఇటు న్యాయవ్యవస్థ అంతా కలసి భారీగా పెరిగిపోయిన పెండింగ్ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటే తప్ప ఈ సమస్య ఒక కొలిక్కి రాదు. ఆ దిశలో కృషి జరుగుతుందని ఆశిద్దాం!...



## న్యాయదేవత కంటతడి

దేశవ్యాప్తంగా ఎంతోకాలంగా పెండింగ్ కేసులు కొండల్లా పెరిగిపోవడం పట్ల ఇటీవల భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ భావోద్వేగంతో చేసిన ప్రసంగం అందరినీ కదిలించింది. ప్రధాని నరేంద్రమోడీ వెంటనే సానుకూలంగా స్పందించి, ఆ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, సామాన్యునికి సత్వర న్యాయం కలిగించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా వుంటుందని భరోసా ఇవ్వడంతో.. ఏళ్లతరబడిగా వున్న ఈ పెండింగ్ కేసుల సమస్య త్వరలో ఒక కొలిక్కి వస్తుందని ఆశిద్దాం!

# బరువెక్కిన హృదయాలతో.. చిన్నారుల వీడ్కోలు



ఒక్కటిగా కలిసిమెలిసి స్నేహంగా చదువుకున్న వారు విడిపోతుంటే ఒక్కసారిగా భావోద్వేగాలకు గురయ్యి, వెక్కివెక్కి ఏడ్చారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆవేదన చెందారు. వారి ప్రేమాభిమానాలు చూసి ఉపాధ్యాయులు, సిబ్బంది, ముఖ్య అతిథులు కంటతడి పెట్టిన సంఘటన నెల్లూరు కొండాయపాలెంలోని నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో 23వ తేదీ జరిగింది. అయిదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో బరువెక్కిన హృదయాలతో చిన్నారులు ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. ఆ పాఠశాలలో అయిదవ తరగతిలో 20మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. వారంతా ఒకటవ తరగతి నుంచి కలిసే చదువుకుంటున్నారు. పైతరగతులు ఆ పాఠశాలలో లేకపోవడంతో వారంతా 6వ తరగతికి వేరేవేరే పాఠశాలల్లో చేరనున్నారు. 23వ తేదీ చివరి తరగతి అనంతరం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో వారంతా ఒక్కసారిగా భావోద్వేగాలను ఆపుకోలేకపోయారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా తెలుగు భాషోద్యమ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చలంచర్ల భాస్కరరెడ్డి, బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి, ఏపి ఎస్ఎఫ్‌సి జూనియర్ అధికారి బిఆర్ శ్రీధర్ వారి స్నేహాన్ని చూసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యార్థులు ఎక్కడున్నా ఎలా చదువుతున్నా చిరకాలం కలిసిమెలిసి స్నేహభావంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు, ఉపాధ్యాయుడు హరీష్, విద్యా వాలంటరీ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇంత దూరం గడిచాక' ఆవిష్కరణ



ఇటీవల గుంటూరుజిల్లా రచయితల సంఘం వేదిక గుంటూరులో ప్రముఖ రచయిత్రి డా॥ సి.భవానీదేవి కవితా సంపుటి 'ఇంత దూరం గడిచాక'ని ప్రముఖ కవి కె.శివారెడ్డి ఆవిష్కరించారు. అధ్యక్షులుగా కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అతిథులుగా పాపినేని శివశంకర్, శ్రీమతి అల్లూరి గౌరీలక్ష్మి, షేక్ కాశింబీ, కోసూరి రవి కుమార్ పాల్గొన్నారు. సోమేపల్లి వెంకట సుబ్బయ్యకు కావ్యం అంకితం చేశారు.


## 30న 'గీతా సుధాలహరి' గ్రంథావిష్కరణ

శ్రీ నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 30వతేదీ సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో అగస్త్యరెడ్డి వెంకురెడ్డిచే రచింపబడిన 'గీతా సుధాలహరి'(పునర్ముద్రణ) గ్రంథావిష్కరణ సభ జరుగుతుందని వర్ధమాన సమాజం అధ్యక్ష కార్యదర్శులు వంటేరు వెంకటకృష్ణారెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథావిష్కరణ, కార్యక్రమానికి సభాధ్యక్షులుగా నరసింహకొండ వేదగిరి ఆశ్రమం పరమపూజ్య శ్రీమాన్ మహేశానందస్వామి వ్యవహరిస్తారని తెలిపారు. గ్రంథ సమీక్షకులుగా మధురభారతి బ్రహ్మశ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, సభా నిర్వహణను విఆర్ పిజి కళాశాల ఆంధ్రోపన్యాసకులు బత్తిన సాయికుమార్‌రెడ్డి నిర్వహిస్తారని, కార్యక్రమంలో సాహితీప్రియులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## హిందూ తీవ్రవాద సన్యాసి

యధార్థాన్ని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పగల హిందూవాది ప్రవీణ్ తొగాడియా. భారతదేశంలో హిందువులు మైనార్టీలుగా మారకూడదని పోరాడుతున్న క్యాన్సర్ నివారణ నిపుణులు. రాష్ట్రంలో ద్వారకా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి కూడా హిందూ మతవాది. ఎవరు ఏమనుకున్నా ఆయన చెప్పదలచుకున్నది చెబుతున్నాడు. హిందూ వాదులు ధైర్యంగా మాట్లాడడం మంచిదే. ఈమధ్య హిందూ వ్యతిరేకశక్తుల పేరుతో దేశద్రోహులు పెరుగుతున్నారు. వారి పీచమణచాలంటే దైవభక్తి, దేశభక్తి పెంపొందించాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**




## కఠిన చర్యలు తీసుకోండి

వేదగిరి లక్ష్మీనరసింహస్వామి భూముల్లో టేకు, మామిడి, కొబ్బరి చెట్లను కొట్టేసి, స్వామికే శఠగోపం పెట్టాలని చూసిన నిందితులను ఊరికే వదలకూడదు. తగిన సెక్షన్‌లు పెట్టి శిక్షపడేలా చూడాలి. నరసింహపురం ప్రాంతంలో ఎంతోమంది వీరివల్ల బాధలు అనుభవించారు. వారి ఉసురు ఈ నిందితులకు తగలకుండాపోదు.

**పెంచలయ్య, నెల్లూరురూరల్.**

## చెట్లను పెంచాల్సిందే!

కాస్తున్న ఎండలను చూస్తుంటే భయమేస్తోంది. ప్రతి ఏటా ఈ ఎండలు పెరగడం తప్పించి తగ్గడం వుండదు. ఎండలు పెరగడానికి ప్రధాన కారణం పర్యావరణానికి మనం చేటుచేస్తుండడమే. ఉష్ణోగ్రతలను తగ్గించే శక్తి కేవలం చెట్లకు మాత్రమే వుంది. మనిషి వ్యాపార ప్రయోజనాల దృష్టితో చెట్లను నరికేస్తున్నాడు. అడవులను కాజేస్తున్నాడు. పెద్దపెద్ద చెట్లను కొట్టేసి పార్కుల పేరుతో పిచ్చి మొక్కలు, గడ్డిపరకలు నాటుతున్నారు. ఇంతకు ముందు ప్రతి ఇంటి ఆవరణలోనూ మంచిమంచి చెట్లుండేవి. అలాంటి చెట్లుంటే ఇంటికి ఏసిలు కూడా అవసరం లేదు. కాని ఇప్పుడు 50అంకణాల స్థలంలో కూడా అపార్ట్‌మెంట్లు కట్టేస్తున్నారు. చెట్లు పెంచడానికి అడుగు స్థలం కూడా వదలడం లేదు. చెట్లన్నీ హరించుకుపోతున్న ఫలితమే ఈ మండుతున్న ఎండలు.

**ఎల్.రాజగోపాల్, నెల్లూరు.**




## నెల్లూరు వైద్యశాలకూ...
# ర్యాగింగ్ రోగం

ఈమధ్య విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు ఎంత చెత్తగా మారుతున్నాయో చూస్తున్నాం. ఉగ్రవాదులకు సంతాపసభలు పెట్టడం, కన్నతల్లి వంటి దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం.. ఈ పనులు చేసి మీడియాలో హీరోలైపోవడం ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. ఇక పలు విద్యాలయాల్లో ర్యాగింగ్ విషసంస్కృతి వేళ్లూనుకునిపోయింది. బుద్ధిగా చదువుకోండి, మీ బ్రతుకులను మార్చుకోవడంతో పాటు మీ తల్లిదండ్రుల ఆశలను కూడా నెరవేర్చండని ప్రభుత్వమే విద్యార్థులకు ఉచితంగా సీట్లిచ్చి, ఫ్రీగా పుస్తకాల, బెడ్డు ఇచ్చి చదువు కోమంటుంటే, వీళ్లపైన కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే వీళ్లు మాత్రం చదువులను గాలికొదిలేసి, సంస్కారాన్ని పక్కనపెట్టి తిన్నది అరక్క కొవ్వు పట్టిన చేష్టలతో ర్యాగింగ్ వంటి వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. నెల్లూరుజిల్లాలోని కళాశాలల్లో ర్యాగింగ్ సంస్కృతి చాలా తక్కువ. కాని ఇప్పుడు నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలలో ర్యాగింగ్ విషబీజం పడింది.

ఈ కాలేజీని ప్రారంభించిన నాటి నుండి వివాదాలే. అయితే మొదట అధ్యాపకుల మధ్య వివాదాలుండేవి. ఇప్పుడది విద్యార్థులకు కూడా పాకింది. కళాశాలలోని వసతి గృహాలలో జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. జూనియర్ విద్యార్థుల భోజనం ప్లేట్లను లాక్కోవడం, వారి చేత తమ బట్టలు ఉతికించడం, వారి చేత గోడల మీద అసభ్యకరమైన రాతలు రాయించడం వంటి పైత్యపు చేష్టలకు పాల్పడ్డారు. ఇక్కడ విచారించాల్సిందేంటంటే ఈ ర్యాగింగ్‌లో విద్యార్థులకు పోటీగా విద్యార్థినులు కూడా పాల్గొనడం. బాధిత విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడం, వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ర్యాగింగ్ వెలుగులోకి చ్చింది. పోలీసులు ఏడు మంది విద్యార్థినులను, ఐదుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. అయితే బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు దయచూపి, మళ్లీ భవిష్యత్ పాడుకాకూడదని మంచి మనసుతో ఆలోచించి కేసులు పెట్టకుండా చేశారు. కేవలం వారిని కొంతకాలం పాటు హాస్టళ్ల నుండి సస్పెండ్ చేస్తూ కళాశాల కమిటీ చర్యలు తీసుకుంది. ఈ విద్యార్థులు ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ర్యాగింగ్ రాక్షస జాడ్యాన్ని ఒంటి నుండి వదిలించుకుంటే మంచిది.

## సేవ కోసం...
# 'దేశం'లోకి..



- వైకాపాకు విపిఆర్ రాజీనామా

*వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని వీడి ఇప్పటి వరకు 17మంది ఎమ్మెల్యేలు తెలుగుదేశంలోకి పోయారు. నెల్లూరుజిల్లాలో కూడా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఇటీవల తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! అయితే వీరిలో ఇద్దరి ముగ్గురి వల్ల తప్పితే మిగతా వారు పోయినందువల్ల వైకాపాకు నష్టమేమీ లేదు. కాని నెల్లూరు జిల్లాలో మాత్రం వైకాపాకు అసలైన నష్టం తన నిస్వార్థ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పాపులారిటీ తెచ్చుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నిలబెట్టుకోలేకపోవడం వల్లే జరగబోతోంది. వేమిరెడ్డిని తన పార్టీలో ఉంచుకోవడంలో జగన్ విఫలమయ్యాడు. దీనికి పర్యవసానం రాబోయే ఎన్నికల్లో తీవ్రంగానే ఉండబోతోంది.*

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డికి సన్నిహితుడైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన కాలంలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు. వై.యస్ వున్నప్పుడే వచ్చివుంటే విపిఆర్‌కు ఆయన ఇచ్చే ప్రాధాన్యత వేరుగా వుండేది. వై.యస్ మరణం తర్వాత ఆయన తనయుడు జగన్‌కు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో విపిఆర్ 2014 ఎన్నికలకు ముందు వైకాపాలో చేరాడు. 2014ఎన్నికల్లో పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూ పార్టీ అభ్యర్థులకు కొండంత అండగా నిలిచి, జిల్లాలో ఆ పార్టీకి మెజార్టీ సీట్లు రావడంలో కీలకపాత్ర పోషించాడు.

అయితే ఆ తర్వాత వైకాపా అధిష్టానం విపిఆర్ సేవలను గుర్తించడంలో విఫలమైంది. ఆయనకిచ్చిన హామీని విస్మరించింది. తొలుత జగన్‌లో వైయస్‌ను తలచుకుని వైకాపాలో చేరిన విపిఆర్ ఆ తర్వాత వై.యస్.కు, జగన్‌కు పొంతన లేదని తెలుసుకున్నాడు. అందుకే వైకాపాను వీడి తెలుగుదేశంలో చేరాలని నిర్ణయించుకున్నాడు. తన నిర్ణయాన్ని ఆయన సోమవారం నెల్లూరులోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వైకాపాకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించాడు. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరనున్నట్లు తెలిపాడు. వాస్తవంగా ఈనెల 27వ తేదీన నెల్లూరులో ముఖ్యమంత్రి పర్యటన ఉండాల్సిందని, ఆరోజే పార్టీలో చేరాల్సినప్పటికీ, సీఎం పర్యటన వాయిదా పడడంతో పార్టీలో చేరే కార్యక్రమం వాయిదా పడిందని, త్వరలో సీఎం సమక్షంలోనే తెలుగుదేశంలో చేరనున్నానని చెప్పాడు. తన సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఏదన్నా చేసుకోవాలనే తపన తనకు లేదని, అధికారపార్టీలో చేరితే తాను చేయదలచుకున్న సేవా కార్యక్రమాలను ఇంకా విస్తృతం చేయవచ్చనే ఉద్దేశ్యంతోనే తెలుగుదేశంలో చేరుతున్నట్లు ప్రకటించాడు.

రాజకీయంగా తనకు శత్రువులెవరూ లేరని, తెలుగు దేశంలో అందరిని కలుపుకుని, అందరితో కలిసి పనిచేస్తానని చెప్పారు. వైకాపాలో వుంటూ మన స్థానానికి గుర్తై, ఆ పార్టీని వీడుతున్న సందర్భంలో కూడా ఆయన వైకాపా మీద, జగన్ మీద ఎలాంటి ఆరోపణలు చేయకుండా హుందాగా తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం!

# ఇసుకలో కూరుకుపోయారు



ఈ రాష్ట్రంలో చంద్రబాబు ఎవరినీ ప్రశాంతంగా బ్రతకనీయడం లేదు. రైతుల పరిస్థితి చూస్తే అంతంత మాత్రం. వ్యాపారాలు దారుణంగా వున్నాయి. ఐపి పెడుతున్న రియల్ వ్యాపారులు పెరుగుతున్నారు. మద్యం వ్యాపారాలు గతమంత ఘనంగా లేవు. చంద్రబాబు ఇసుక రీచ్‌లను డ్వాక్రా మహిళా సంఘాలకు అప్పగించాక ఇసుక కేంట్రాక్టర్లందరూ తలా ఒక పనిలోపడ్డారు. మళ్లీ ఏం గుబులు పుట్టిందో ఏమో... ఇసుక రీచ్‌లకు టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లందరూ పాలో మంటూ పరుగులు తీసి లక్షలకు లక్షలు వడ్డీలకు అప్పులు తెచ్చారు. అప్లికేషన్ ఖరీదే పాతికవేల నుండి లక్ష రూపాయలు. రీచ్‌ను బట్టి రేటు... ఒక్కో రీచ్‌కు టెండర్ వేయాలంటే డిడిలు కట్టాలి కదా... ఆ విధంగా కోట్లాది రూపాయలు కట్టేశారు. ఈ తంతు అంతా ముగిసాక చంద్రబాబు ఇసుక ఫ్రీ అని కాంట్రాక్టర్ల గుండెల్లో బాంబు పేల్చాడు. ఇదంటే ఇలా వెలగబెట్టారు.. కనీసం కాంట్రాక్టర్లు కట్టిన డబ్బులన్నా వెనక్కిచ్చారా అంటే అదీ లేదు. ఇంత వరకు డి.డిల డబ్బులు రాలేదు. అప్లికేషన్ ఛార్జీలు వాపసు ఇచ్చేది లేదంటున్నారు. అసలు టెండర్లు పెట్టకుండా అప్లికేషన్ ఛార్జీలు తీసుకోవడమన్నది ఏ ప్రభుత్వంలో, ఏ దేశంలో జరిగి వుండదు. ఇక ఆన్‌లైన్ నమోదుకని అక్కడా ఇక్కడా తిరిగి కాంట్రాక్టర్లు బాగానే చేతి చిలుం వదిలించుకున్నారు. ఇసుక రీచ్‌లను కొల్లగొడదామని వచ్చిన కాంట్రాక్టర్లు ఆ ఇసుక కుప్పల్లోనే కూరుకుపోయారు.

# మళ్లీ పాత ఐలాండ్‌లే!



గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నెల్లూరు నగరాన్ని మనుమసిద్ధి మారాజులా ఏలిన మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నగరంలోని పలు విగ్రహాల ఐల్యాండ్‌లను ప్రత్యేకశ్రద్ధతో నిర్మించారు. ఉన్న ఐల్యాండ్‌లను వెడల్పు చేసి పెంచడమేకాకుండా రకరకాల బొమ్మలు, వాటర్ ఫౌంటేన్‌లు పెట్టించి అందంగా తీర్చిదిద్దారు. అయితే ఐల్యాండ్‌లు వెడల్పు చేయడం వల్ల రోడ్లు కుదించుకుపోయి ట్రాఫిక్‌కు పెద్ద ఇబ్బందిగా మారింది.

నెల్లూరులో మద్రాసుబస్టాండ్ వద్ద నెహ్రూ బొమ్మ ఐలాండ్, బాలాజీనగర్ వద్ద పూలే బొమ్మ ఐలాండ్, పొదలకూరు రోడ్డులో రైతు ఐల్యాండ్, కరెంట్ ఆఫీసు సెంటర్‌లో వై.యస్.బొమ్మ ఐల్యాండ్, హరనాథపురం జంక్షన్‌లో ఆనం వెంకురెడ్డి విగ్రహం ఐల్యాండ్‌లు వివేకా హయాంలో నిర్మించబడ్డవే! వీటిని బాగా పొడవు, వెడల్పుతో ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్ రద్దీ ఉన్న రోడ్లలో ఈ ఐల్యాండ్‌ల మూలంగా ట్రాఫిక్‌జాం అవుతోంది. జిల్లా ఎస్పీగా వచ్చిన విశాల్‌గున్ని నగరంలో ట్రాఫిక్‌ను సరిదిద్దే క్రమంలో ఐల్యాండ్‌లపై దృష్టి పెట్టారు. ఐల్యాండ్‌లను కుదించాలని నగరపాలక సంస్థ అధికారులతో చర్చించారు.

ఈమేరకు ఐల్యాండ్‌లు తగ్గించే ప్రక్రియ మొదలయ్యింది. మద్రాసు బస్టాండ్ వద్ద వున్న నెహ్రూ బొమ్మ ఐల్యాండ్‌ను తగ్గించారు. ఐల్యాండ్‌ను తగ్గించాక ఇప్పుడిక్కడ రోడ్డు విశాలంగా మారింది. ట్రాఫిక్ కోసం మరికొన్ని ఐల్యాండ్‌లను తగ్గించనున్నారు.

# ప్రతిపక్ష నేతగా ఫెయిల్
### - జగన్‌పై వివేకా ఫైర్



వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా విఫలమయ్యాడని, ఇలాంటి వాళ్ల చేతికి అధికారం ఇచ్చుంటే రాష్ట్రం పరిస్థితి ఎలా ఉండేదోనని మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఎద్దేవా చేశాడు. 24వ తేదీ నెల్లూరు ఏసి సెంటర్‌లో విలేకరుల సమావేశం పెట్టిన ఆయన జగన్‌పై తన స్టైల్‌లో నిప్పులు చెరిగాడు. తండ్రి వై.యస్.రాజశేఖరరెడ్డి అధికారంలో వున్నప్పుడు జగన్ అక్రమాలకు, అవినీతి సంపాదనకు అడ్డు లేకుండా పోయింది. ఆయన వల్ల ఎంతోమంది ఐఏఎస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు పోవాల్సి వచ్చింది. ఆయన పాపాలు పండి త్వరలో జైలుకు పోవడం ఖాయమని చెప్పాడు వివేకా! వై.యస్. మరణంతో వచ్చిన సానుభూతి వల్లే జగన్‌కు ఆ సీట్లన్నా వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో సానుభూతి ఉండదు, ఆ సీట్లు కూడా ఉండవు. ప్రతిపక్ష నేతగా కూడా రాణించలేకపోతున్న జగన్‌ను ఇక ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అన్ని వర్గాల ప్రజలు వైసిపిని వీడుతున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలకే జగన్ మీద నమ్మకం లేక, తెలుగుదేశంలో చేరుతున్నారన్నారు.


సమావేశంలో ఆనం రంగమయూర్ రెడ్డి, కె.వి.రాఘవరెడ్డి, బర్నాబాసు, యర్రం మాధవరెడ్డి, మునాఫ్, ముప్పసాని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# నెల్లూరు కబుర్లు

## మే మొదటి వారంలో సీఎం పర్యటన



ఏప్రిల్ 27వ తేదీన జిల్లాలో జరగాల్సిన సీఎం చంద్రబాబు పర్యటన రద్దయ్యింది. ఆరోజు చంద్రబాబు జిల్లాలోని పలు కార్యక్రమాలలో పాల్గొనాల్సి వుండింది. ఈమేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది. అయితే అదేరోజు వైకాపా ఎమ్మెల్యేలు ముగ్గురు తెలుగుదేశంలో చేరడంతో సీఎం నెల్లూరుజిల్లా పర్యటనను రద్దు చేసుకున్నారు. మే మొదటి వారంలో తిరిగి ముఖ్యమంత్రి జిల్లా పర్యటన వుండొచ్చు.

## సన్నపరెడ్డి సైకిల్ సవారీ




ఆత్మీయ సదస్సులో ప్రసంగిస్తున్న సన్నపరెడ్డి పెంచలరెడ్డి, పక్కన ఆదాల ప్రభాకర్‌రెడ్డి

గతంలో ఆనం సోదరులకు ఐదో తమ్ముడిగా పేరుబడ్డ వ్యాపార వర్గాల నాయకుడు, మాజీకార్పొరేటర్ సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ఇప్పుడు ఆదాల తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలో తన సత్తా చూపేందుకు ఏప్రిల్ 23వ తేదీన పప్పులవీధిలో ఆత్మీయసదస్సు పేరుతో పెద్ద కార్యక్రమమే పెట్టాడు. ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరేరోజు తమతో పాటు రమ్మని వాళ్ళు పెంచలరెడ్డిని పిలవలేదు. ఇప్పుడు తెలుగుదేశంలో చేరుతున్నప్పటికి తాను ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కూడా పెంచలరెడ్డి ఆనం సోదరులను పిలవలేదు. ఇది పూర్తిగా ఆదాల వర్గం కార్యక్రమ మైంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డితో పాటు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, టి.అనూరాధ, ఆనం జయకుమార్‌రెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, వై.వి.రామిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా పెంచలరెడ్డికి ఎప్పుడూ తోడూ నీడలా వుండే వ్యాపారవర్గాల ప్రతినిధులు దాసా లక్ష్మీనారాయణ, మంచికంటి శ్రీనివాసులు, శ్రీరామ సురేష్, చలువాది నాగేశ్వరరావు, పెసల నరసింహస్వామి, కందె శ్రీనివాసులు, వెలుగొండయ్యలతో పాటు 150మంది దాకా తెలుగుదేశంలో చేరారు.

## వైద్యకళాశాల ప్రిన్సిపల్‌గా రవిప్రభు

నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్‌గా రవిప్రభును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్‌ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ రవిప్రభు వైద్యకళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్‌గా కొనసాగిన కృష్ణమూర్తి శాస్త్రి కొంతకాలం క్రితం తనను ప్రిన్సిపల్ బాధ్యతల నుంచి తప్పించాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రిన్సిపాళ్ళను మార్పు చేస్తూ ప్రభుత్వాలు జారీ చేసిన 141జీవోలో కృష్ణమూర్తిని బాధ్యతల నుంచి తప్పించింది. ఈయన ఇక నుంచి వైద్యకళాశాలలో అనస్తీషియా ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు.

## రెయిన్‌బోలో పుస్తక దినోత్సవం



ఏప్రిల్ 23వ తేదీన నెల్లూరు రూరల్ ధనలక్ష్మీపురంలోని రెయిన్‌బో సిబిఎస్ఇ స్కూల్‌లో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుప్రసిద్ధ రచయితలు, కవుల చిత్రపటాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు వారి రచనా పటిమను తెలియ జెప్పడంతో పాటు వారు రాసిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. అలాగే విద్యార్థులు పలువురు రచయితల వేషధారణలతో అలరించారు. పిల్లల్లో పుస్తకాల పట్ల మక్కువ పెంచి, పుస్తక పఠనంపై శ్రద్ధ కల్పించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసామని స్కూల్ డైరెక్టర్ పద్మసుబ్రహ్మణ్యం తెలిపారు. తల్లిదండ్రులు కూడా మంచి మంచి పుస్తకాలు తీసి విద్యార్థుల చేత చదివించాలని, గొప్పవాళ్ళ జీవితచరిత్రలు, ఆత్మకథలు చదివితే మన జీవితాలను మనం మార్చుకోగలమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామగిరి విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జీ బదిలీ

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పని చేస్తున్న సి.హెచ్. కనకదుర్గారావును చిత్తూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి అదనపు జిల్లా జడ్జిగా వున్న శ్యామలాదేవికి ఇన్‌ఛార్జ్ జిల్లా జడ్జి బాధ్యతలు అప్పగించారు. కనకదుర్గారావు ఈ జిల్లాలో మూడేళ్ల పాటూ పనిచేశారు. లోక్‌అదాలత్ ఛైర్మెన్‌గా వ్యవహరిస్తూ జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారానికి విశేష కృషి చేశారు.

## 5వ నగర సిఐగా మంగారావు

నెల్లూరు 5వ నగర సిఐగా మంగా రావు ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. కావలి రెండో పట్టణ సిఐగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ సిఐగా వున్న సుబ్బారావును ఇస్కపల్లి మెరైన్ సిఐగా బదిలీ చేశారు.

## 'మెంటల్ పోలీస్'పై స్టే

'మెంటల్ పోలీసు' సినిమా విడుదలపై హైకోర్టు స్టే ఇచ్చినట్లు జిల్లా పోలీసు అధికారుల సంఘం గౌరవాధ్యక్షులు వై.శ్రీహరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల మనోభావాలు దెబ్బ తినేలా వున్న ఈ సినిమా పేరు మార్చాలంటూ శ్రీహరిబాబు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ వారికి ఫిర్యాదు చేశారు. అలాగే హైకోర్టులో పిల్ వేశారు. ఈ మేరకు కోర్టు స్టే ఇచ్చింది. సినీదర్శకులు, నిర్మాతలు ఇకనైనా పోలీసులను కించ పరిచేలా కాకుండా వారి గౌరవాన్ని కాపాడేలా టైటిల్స్ పెట్టాలని కోరారు.

## దంత వైద్య రంగంలో అరుదైన శస్త్ర చికిత్స

- డా॥ టి.రవికుమార్




విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డా॥ రవికుమార్

నెల్లూరు పొగతోటలోని రిచ్ చిన్నపిల్లల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో స్థాపించిన లిటిల్ టీత్ ఏకైక చిన్న పిల్లల దంత వైద్యశాల అనతికాలంలోనే ఓ చిన్నారికి ఆరోగ్యకరమైన చిరునవ్వును అందించడంలో విజయం సాధించింది. ఈ సందర్భంగా రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ ఛైర్మెన్ డా॥ రవికుమార్ 23వతేదీ విలేకర్లతో మాట్లా డుతూ కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన 10సంవత్సరాల చంద్రకళ అనే బాలికకు పిప్పిపళ్ళు, వంకరపళ్ళు ఉన్నాయని, పదేళ్లయినా ఇంకా కొన్ని పళ్ళు రాలేదని తెలిపారు. ఈ క్రమంలో పలు ఆస్పత్రులు చుట్టూ తిరిగినా తగిన వైద్యం అందించలేకపోయారని, అనంతరం తమ ఆసుపత్రికి తీసుకొచ్చిన వెంటనే పాపకు ఆపరేషన్ చేసి చీము లేకుండా పళ్లసందులు, వంకరపళ్లను సరిచేసామన్నారు. అయిదారు సిట్టింగ్స్‌లో చేయాల్సిన వైద్యాన్ని తాము ఒకే సిట్టింగ్‌లో అనస్తీషియా పద్ధతిలో అయిదుమంది నిపుణుల పర్యవేక్షణలో ఆరుగంటల్లో చేసినట్లు వివరించారు. దూర ప్రాంతాల నుండి వచ్చే పిల్లలకు, ఉద్యోగస్తులైన తల్లిదండ్రుల పిల్లలకు, దంత వైద్యం అంటే ఆందోళన ఉన్నపిల్లలకు సంబంధించిన అన్ని రకాల గుండె, లివర్, ఊపిరితిత్తులు, మెదడు సమస్యలకు సంబంధించిన అన్ని రకాల సూపర్‌స్పెషాలిటి వైద్యసేవలను రిచ్ చిన్నపిల్లల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కల్పించినట్లు తెలిపారు. దంత విభాగంలో చిన్నపిల్లల కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ రాష్ట్రంలో నెల్లూరులోనే తొలిసారిగా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశంలో దంత వైద్య నిపుణులు డా॥ శ్రీకాంత్ మలినేని, డా॥ డి.సుధీర్, డా॥ జయచంద్ర పాల్గొన్నారు.

## సిఐడి డిఎస్పీ వెంకటేశ్వర్లు బదిలీ

నెల్లూరు సిఐడి డిఎస్పీగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును విజయవాడ ట్రాఫిక్ ఏసిపిగా బదిలీ చేస్తూ డిజిపి కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. వెంకటేశ్వర్లు గతంలో ఎస్ఐగా, సిఐగా జిల్లాలోని అనేక ప్రాంతాలలో పని చేశారు.



## 'రత్నం'కు అభినందనలు తెలిపిన రావి

తెలుగుదేశం పార్టీ కర్నాటక రాష్ట్రం కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి మంగళవారం నెల్లూరులో రత్నం విద్యా సంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నంను ఆయన నివాసంలో కలిశారు. 2016 ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించినందుకు రావి మోహన్‌చౌదరి ఆయనకు అభినందనలు తెలిపారు.

## మే 11 నుంచి జగద్గురు ఆదిశంకర జయంత్యుత్సవాలు



కీర్తిశేషులు స్వయంపాకుల వేంకటశేష శాస్త్రి స్థాపించిన శ్రీ పినాకిని విద్యాపీఠం ఆధ్వర్యంలో మే నెల 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకర జయంత్యుత్సవాల 70వ వార్షికోత్సవాలను నెల్లూరు ట్రంకురోడ్డు లోని టివిఎస్ కళ్యాణసదన్‌లో నిర్వహిస్తు న్నట్లు విద్యాపీఠం అధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు తెలిపారు. ఈ అయిదురోజులు ఉదయం వేదపారాయణలు జగద్గురు శంకరా చార్య శ్రీ విద్యారణ్య భారతి స్వాముల వారి పీఠపూజ - దేవ తార్చన, స్వామి వారలచే తీర్థప్రసాద వితరణ జరుగుతుం దన్నారు. సాయంత్రం లలిత విష్ణుసహస్రనామస్తోత్ర పారా యణం, ఆధ్యాత్మికోపన్యాసాలు, స్వామివారి అనుగ్రహ భాషం ఉంటుందన్నారు. 15వ తేదీ ఆదివారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు చతుర్వేద పండితులచే వేదస్వస్తి - వేదాశీర్వచనాలచే వేదసభ నిర్వహిస్తున్నట్లు తెలి పారు. 11వ తేదీ సాయంత్రం 6-30గంటల నుండి శివా నందలహరి, అద్వైతార్థము విషయంపై తెనాలి విశ్రాంత తెలుగురీడర్ బ్రహ్మశ్రీ డా॥ ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి ఉపన్యసిస్తారని తెలిపారు. 12వ తేదీ సాయంత్రం 6-30గంటలకు శ్రీ కంఠం నాగలక్ష్మి, పాలేటి హేమలక్ష్మి, కంఠంరాజు పద్మాచక్ర వర్తిల వీణకచ్చేరి జరుగుతుందన్నారు. 13వ తేదీ సాయంత్రం 6-30గంటలకు శ్రీ శంకర విరచిత శ్రీమాతా వైభవము విషయంపై విజయవాడ మారిస్ స్టెల్లా కళాశాల సంస్కృత శాఖాధ్యక్షులు డా॥ దూళిపాళ రామకృష్ణ ఉపన్యసిస్తారని తెలిపారు. 14వ తేదీ సాయంత్రం 6-30 గంటలకు శ్రీ శంకర విరచిత శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్ర భాష్యం విషయంపై నెల్లూరు వేద సంస్కృత కళాశాల తెలుగు రీడర్ డా॥ కప్పర గిరిజాలక్ష్మి ఉపన్యసిస్తారని, 15వ తేదీ సాయంత్రం 6-30గంటలకు వేద సంప్రదాయ వైభవం అనే విషయంపై విజయవాడ శ్రీ వైఖానస ఆగమ పరిషత్ అధ్యక్షులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఉపన్యసిస్తారని తెలిపారు. ఈ అయిదురోజులు ఉచిత వసతి సౌకర్యం అందజేస్తున్న డా॥ సర్వేపల్లి అజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## మలుపులు తిరుగుతున్న...

# టేకు చెట్ల కథ



- తహశీల్దార్ సస్పెండ్
- క్రిమినల్ కేసుల నమోదుకు చర్యలు
- క్వారీ గుంటల్లో బయటపడ్డ టేకు దుంగలు
- అసలు నిందితుడు హంస కోసం వేట

***నెల్లూరురూరల్ మండలం నరసింహపురంలోని శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంకు చెందిన టేకు చెట్ల నరికివేత వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. ఒకటి తవ్వితే ఇంకొకటి.. ఈ కేసును మెలేసి లాగితే వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి కుటుంబం గతంలో చేసిన అక్రమాలు కూడా బయటకు వస్తున్నాయి.***

ఈ కేసులో ప్రధాన నిందితుడైన వేమిరెడ్డి హరిశివారెడ్డి పోలీసుల కళ్లుగప్పి కోర్టులో లొంగి పోగా మరో నిందితుడు వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. హంస కుమార్‌రెడ్డిని ఎలాగైనా అరెస్ట్ చేయాలని పోలీసులు కోర్టుల వద్ద కూడా కాపలా కాస్తున్నారు. సందు చిక్కితే కోర్టులో లొంగిపోవాలని హంసకుమార్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, కొద్దిరోజుల క్రితమే తన ఆధ్వర్యంలో వీరిని తెలుగుదేశంపార్టీలో చేర్పిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా వీళ్లతో తనకేం సంబంధం లేదని, ఇలాంటి అక్రమాలకు తాను వ్యతిరేకమని ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు. కాబట్టి ఈ కేసులో నిందితులకు రాజకీయ రక్షణ కూడా లేనట్లే! తెలుగు దేశంపార్టీ నుండి వీరిని సస్పెండ్ చేయించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఎస్పీ విశాల్‌గున్ని కేసును సీరియస్‌గా తీసుకోవడంతో కేసు బలంగానే తయారవుతోంది.

ఇక తాజాగా నరసింహపురం సమీపంలో గ్రావెల్ క్వారీ గుంతల్లో వీళ్లు దాచిన 51టేకు దుంగలు బయటపడ్డాయి. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఓ హెడ్‌కానిస్టేబుల్ ఈ దుంగల విషయాన్ని బయటకు లాగాడు. ఇవి కూడా నిందితులు డంప్ చేసిన దుంగలేనని తెలుస్తోంది.

టేకు చెట్లు నరికివేతతో వేమిరెడ్డి హంసకుమార్ రెడ్డి చేసిన భూ ఆక్రమణలు, అక్రమాలు కూడా వెలుగులోకి వచ్చాయి. వీటన్నింటి మీద రెవెన్యూ విచారణ జరిగే అవకాశముంది.

దేవాదాయ శాఖ భూముల్లో టేకు చెట్ల నరికి వేతకు ఎన్‌ఓసి జారీ చేసి అడ్డంగా బుక్కయిన గత నెల్లూరు తహశీల్దార్ జనార్ధన్‌ను సస్పెండ్ చేశారు. ఆయనపై క్రిమినల్ కేసుల నమోదుకు రంగం సిద్ధమైంది. ఈ కేసులో మరికొందరు అధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. మొత్తానికి హంసకుమార్‌రెడ్డి అక్రమాల విషయంలో తీగ లాగేకొద్దీ అనేక డొంకలు కదులుతున్నాయి.

## జగన్స్ విద్యాసంస్థతో

# సింహపురికి సాఫ్ట్‌వేర్ కళ




ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడులు డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా కార్యక్రమాల ద్వారా ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నారని, రాష్ట్రంలో నెల్లూరు నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడి విద్యార్థుల కోసం సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

ఆదివారం నెల్లూరు మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న పరమేశ్వరి కళ్యాణ మండపంలో జగన్ విద్యాసంస్థ నెలకొల్పిన సాఫ్ట్‌వేర్ సంస్థ "జెనిసిస్ ప్రొఫెషనల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్"ను ఐటి కంపెనీల ప్రతినిధులతో కలిసి సోమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటి రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను గుర్తించి వాటికి అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తే దేశవిదేశాలలో చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. క్రింది స్థాయి నుంచి జగన్మోహన్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగి విద్యార్థుల ఉపాధి కోసం సాఫ్ట్‌వేర్ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ సంస్థ మూడు పువ్వులు, ఆరు కాయలుగా అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. విజన్ సాఫ్ట్‌వేర్ సంస్థ శుభకర్‌రెడ్డి మాట్లాడుతూ ఐటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా జగన్స్ సంస్థ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం వల్ల పలువురికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. స్పైడర్ సంస్థ ఆసియా, పసిఫిక్ దేశాల ఉపాధ్యక్షుడు టి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాలల్లో ఆంగ్లభాషలో పట్టు సాధించేందుకు ఇంగ్లీషు లెర్నర్స్ క్లబ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డిఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ అధినేత సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సివిల్ రంగంలో కూడా కంప్యూటర్లు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. జగన్ విద్యాసంస్థల అధినేత జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి దశలో తమ కళాశాలలో 60శాతం మార్కులతో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులందరికి ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతోనే సాఫ్ట్‌వేర్ సంస్థను నెలకొల్పామన్నారు. స్టార్టప్‌గా దీనిని ప్రారంభించామని, భవిష్యత్‌లో వేలాదిమందికి ఉపాధి కల్పించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, ఐటి పరిశ్రమలకు వారధిగా తమ సంస్థ పని చేస్తుందన్నారు. ఇప్పటికే వివిధ కళాశాలలకు చెందిన 47మంది విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా అతిథులు వేదికపై అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరిప్రకాశ్, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పితృదేవోభవ

సంఘసేవకులు, ప్రజాసేవకులు

స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారు

నిర్యాణం 4 మే 1992

24వ వర్ధంతి (04.05.16) సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు

శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...

డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి

రాజ్యసభ సభ్యులు, మాజీ కేంద్రమంత్రివర్యులు

కుమారుడు



అనారోగ్యంతో 2015 డిసెంబర్‌లో మృతిచెందిన కానిస్టేబుల్ శ్రీనివాసులు కుటుంబానికి సహాయాన్ని అందజేస్తున్న నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్ గున్ని

### కోదండ రామస్వామి దేవస్థానం

# పాలకవర్గ ప్రమాణస్వీకారం



నెల్లూరురూరల్ పొట్టేపాలెంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఈ నెల 23వ తేదీన దేవస్థానం ప్రాంగణంలో ఘనంగా జరిగింది. దేవస్థానం ఛైర్మెన్‌గా పొన్నాల రామచంద్రారెడ్డి, సభ్యులుగా చెన్నారెడ్డి సునీల్‌రెడ్డి, ఉప్పాల రామచంద్రయ్య, పొన్నాల శ్రీనివాసులు రెడ్డి, నరసమ్మలు ప్రమాణస్వీకారం చేశారు. మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తెలుగు దేశంపార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఆనం జయకుమార్‌రెడ్డి, నూనె మల్లిఖార్జున యాదవ్, సిహెచ్ హరిబాబు, స్వర్ణ వెంకయ్య, టిటిడి ధర్మప్రచార పరిషత్ సభ్యులు కొండా శేఖర్‌రెడ్డి, పొన్నాల వెంకటశేషారెడ్డి, ఇ.ఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ దేవస్థానం అభివృద్ధికి పొన్నాల రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులు ఎంతో కృషి చేసారని, ఆయన నేతృత్వంలో దేవస్థానం మరింతగా అభివృద్ధి చెందాలని ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు.

# ఇంకుడు గుంటల ద్వారా నీటి ఆదా

**- డిఎస్పీ శ్రీనివాస్**



ఇంకుడు గుంతను కంకరతో నింపుతున్న డిఎస్పీ బి.శ్రీనివాస్

ఇంకుడు గుంతలను తవ్వి తద్వారా నీటిని ఆదా చేయాలని గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఇంకుడు గుంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపునీరు వృధా కాకుండా నేరుగా భూమిలోకి ఇంకిపోయేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను తవ్వుకోవాలన్నారు. ఇజ్రాయిల్ దేశంలో నీటి వనరులు తక్కువ అయినా అక్కడ ప్రజలు నీటిని పొదుపుగా వాడుతూ ఆదర్శంగా ఉన్నారన్నారు. ఇంకుడుగుంతల తవ్వకం ఉద్యమంలా చేపట్టాలన్నారు. ఇంటింటికి ఇంకుడు గుంత తవ్వుకొనేందుకు ప్రభుత్వం కొంత మొత్తం ఇస్తుందన్నారు. నీటి యాజమాన్య పద్ధతులను నేర్చుకొని పొదుపుగా వాడు కోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సి.ఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్ఐలు గంగాధర్, జగన్మోహన్ రావు, అంకమ్మ, సిబ్బంది సుబ్బనాయుడు, శ్రీధర్‌రావు, క్రాంతికుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌కు

# జాతీయ స్థాయి గుర్తింపు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల యుజిసి ద్వారా అరుదైన "సిపిఇ" గుర్తింపును పొందినట్లు కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోట మండలం విద్యానగర్‌లోని కళాశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 398ఇంజనీరింగ్ కళాశాలలకు గాను ఆరింటికి మాత్రమే ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. నెల్లూరుజిల్లాలో ఈ స్థాయి గుర్తింపును ఎన్‌బికెఆర్ కళాశాల మాత్రమే దక్కించుకోవడం తమకెంతా గర్వకారణమన్నారు. కళాశాలలోని అత్యుత్తమ ప్రమాణాలను, ప్రతిభావంతులైన డాక్టరేట్ కలిగున్న అధ్యాపకుల స్థాయిని, మౌలిక వసతులను పరిగణలోనికి తీసుకుని యూజిసి ఈ గుర్తింపును ఇచ్చినట్లు తెలిపారు. తమ కళాశాల ఎన్ఎసి ద్వారా 'ఎ'గ్రేడ్ అక్రిడిటేషన్‌ను, యూజిసి ద్వారా అటానమస్ స్థాయిని, తాము అందించే కోర్సులు ఎన్‌బిఎ అక్రిడిటేషన్‌ను కల్గి ఉండడం వల్ల దేశంలోని ప్రతిష్టాత్మక కళాశాలల్లో ఒకటిగా తాము గుర్తించబడ్డామన్నారు. 12వ పంచవర్ష ప్రణాళిక కింద యూజిసి నుంచి తమ కళాశాలకు దశల వారీగా నిధులు అందే అవకాశముందన్నారు. కళాశాల అభివృద్ధికి పాటుపడుతున్న సిబ్బందిని, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా॥ వి.విజయ కుమార్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి

# చొరవ చూపాలి

**- సిఐ సుబ్బారావు**

ప్రజలకు ఉన్న సమస్యలపై ఆరాతీసి పరిష్కరించేలా చొరవ తీసుకుంటే మంచి సంబంధాలు మెరుగుపడుతాయని పట్టణ సిఐ సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని 'మన ఊరు - మన పోలీసు'లో భాగంగా 23వ తేదీ 3వ వార్డులో జనార్ధనరెడ్డి కాలనీలో రాత్రి బస చేసి ప్రజల సమస్యలపై ఆరాతీసి నమోదు చేసుకున్నారు. ప్రధానంగా మురుగు కాలువల్లో తొలగించని వ్యర్థాలు, కాలనీలో కోతుల బెడద, చెత్త నిల్వతో అవస్థలు, ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతు చేయాలని స్థానికులు సమస్యలపై ఏకరవు పెట్టారు. సమస్యలను పురపాలక సిబ్బందికి తెలిపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై దశరథ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# క్రీడలతోనే మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తుందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ క్రీడా ప్రాంగణంలో పేటేటి సత్యం నాయుడు మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేత జట్టుకు బహుమతి ప్రదానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, ఈ పోటీల్లో బీవీకె గూడూరు జట్టు విజయం సాధించగా, జీసీసీ గూడూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20,000/-, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10,000/- బహుమతి ప్రదానం చేసినట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాటంబేటి శివకుమార్, శ్రీదేవి, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'నీరు - చెట్టు'కు 22.7కోట్లు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్

గూడూరు నియోజకవర్గానికి 'నీరు-చెట్టు' కార్యక్రమం క్రింద రూ.22.7కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో సోమవారం నాడు ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నిధులను అధికారులు సక్రమంగా ఉపయోగించాలన్నారు. పనుల్లో నాణ్యతను పాటించాలన్నారు. లేదంటే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. మార్కెటింగ్, దేవాదాయ కమిటీల్లో తెలుగుదేశం పార్టీ, వైకాపా నుంచి వచ్చిన కార్యకర్తలకు సమప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ సందర్భంగా కొందరు నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, మండల నాయకులు బొల్లినేని కోటేశ్వరరావు, వాటంబేటి శివకుమార్, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాంగణ ఎంపికల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

గూడూరు పట్టణ సమీపానున్న నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సిస్ట్రోన్, ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శనరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికల్లో పదిమంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి రూ.1.20లక్షలు వార్షిక వేతనాన్ని ఆ కంపెనీ చెల్లిస్తుందన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలోనుండవు. ఆదాయం తగ్గుతుంది. అవసరాలకు దాచుకున్న దాని నుండి గాని, ఋణం గాని చేయక తప్పదు. అనుకున్న పనులు వాయిదా పడవచ్చును లేక నిదానంగా జరుగ వచ్చును. గాయాలు తగలవచ్చును. ప్రభుత్వ పరంగా అనుమతులు శ్రమతో లభిస్తాయి. స్థిరాస్తుల లావాదేవీలు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఇంటా బయట వ్యవహార బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆదాయం తగ్గుతుంది. ఏదో ఒక రూపంలో ఖర్చులు పెనబడ గలవు. అనుకున్న పనులను లౌక్యంగా సర్దుబాటు చేసి కొనవచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. కుటుంబంలో భిన్నాభిప్రాయాలుంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

నూతన పెట్టుబడులు, పొదుపు పథకాలకు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సమస్యలను సర్దుబాటు చేసి కొనండి. తెగేదాకా లాగవద్దు. ఇతరులతో జాగ్రత్తగా వ్యవహరించండి. వృత్తి వ్యాపారాలలో ఆదాయము సంతృప్తికరము. అనుకున్న పనులు సక్రమంగానే జరుగుతాయి. అనుకోని ఆదాయం, అనుకోని ప్రయాణాలుంటాయి. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయము పెంచుకొనే మార్గాల కొరకు ప్రయత్నాలుంటాయి. మీ వ్యవహారాలను సొంతంగా పర్యవేక్షించడం మంచిది. వృత్తి వ్యాపారాలు సామాన్య రాబడినిస్తాయి. వ్యాపార భాగస్వామ్యాల అవకాశాలు, కొత్త కాంట్రాక్టులు లభించవచ్చును. పనులు సక్రమంగా జరుగుతాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. ఉద్యోగార్థుల ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేపట్టిన పనులు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. కాని ఎక్కువగా టెన్షన్ పడుతుంటారు. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. ముఖ్యమైన వ్యక్తులను, ప్రముఖులను కలుసుకొంటారు. చెప్పుడు మాటలు వినకుండా సొంత నిర్ణయాలు తీసి కొంటారు. ప్రభుత్వ అనుమతులు బ్యాంకు ఋణాలు లభిస్తాయి. కుటుంబసౌఖ్యము బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఇంట్లో సభ్యులతో అనుకూలత తక్కువ. పిల్లల విద్యా, వివాహాది విషయాలపై ఆందోళన ఉంటుంది. బంధువులతో అభిప్రాయ భేదాలు కలుగవచ్చును. కోర్టు కేసులు వాయిదా పడగలవు. ప్రయాణాలు వాయిదా పడవచ్చును. ఇంటి నిర్మాణాలు నిదానంగా జరుగుతాయి. విద్యార్థులు ఉన్నత విద్యకు మరింత శ్రమ పడవలసి ఉంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 29.4.2016 నుండి**
**తేది. 5.5.2016 వరకు**

ఈ వారం మేషంలో రవి బుధశుక్రులు, సింహంలో గురురాహువులు, వృశ్చికంలో శనికుజులు, కుంభంలో కేతువు, మకరకుంభ మీన మేషంలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 30 శనివారం శుక్ర మౌఢ్యమి ప్రారంభము

ముహూర్తములు లేవు

### చైత్రమాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 29 | శుక్ర | సప్తమి | సా॥ గం.4.27వ॥ |
| తేది. 30 | శని | అష్టమి | సా॥ గం.3.37వ॥ |
| తేది. 1 | ఆది | నవమి | ప॥ గం.2.20వ॥ |
| తేది. 2 | సోమ | దశమి | ప॥ గం.12.47వ॥ |
| తేది. 3 | మంగళ | ఏకాదశి | ఉ॥ గం.10.45వ॥ |
| తేది. 4 | బుధ | ద్వాదశి | ఉ॥ గం.8.32వ॥ |
| తేది. 5 | గురు | త్రయోదశి | ఉ॥ గం.6.10వ॥ |
| | పిదప | చతుర్దశి | పూర్తిగ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపారవృద్ధికి కొత్త పథకాలు, ఆలోచనలతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరము. ఒత్తిడులు మొగమాటాల వల్ల ఇబ్బంది పడవలసి వస్తుంది. ఉద్యోగులు విధి నిర్వహణ ప్రశాంతంగా సాగుతుంది. అనుకున్న పనులు నెరవేరేదాకా పట్టుదలతో కష్టపడతారు. రావలసిన బాకీలు కొంతమేరకు వసూలు కాగలవు. ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్తపడండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కఠినంగా మాట్లాడటం, వ్యవహరించడం వల్ల తగాదాలు రావచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. రాబడి సంతృప్తి సామాన్యము. చేపట్టిన పనులను లౌక్యంగా జరుపుకొనాలి. బంధుమిత్రులతో సమస్యలు రాకుండా చూచుకొనాలి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. కళాక్రీడా రంగాలలో అవకాశ ప్రోత్సాహాలు బాగుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలలో కొంత అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు అందుతాయి. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. కుటుంబంలోను, బంధువులతోను చిన్న విభేదాలుండినా సర్దుబాటు కాగలవు. అప్పులు, హామీలు ఇవ్వవద్దు. నూతన పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు అనుకూలము. కొత్త కాంట్రాక్టులు లీజులు లభించగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులు తొలగిపోయి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. చేయదలచుకున్న పనులను బట్టబయలు చేయకుండా నిర్వహించండి. పట్టుదలగా ప్రయత్నిస్తే పనులు జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు. స్థిరాస్తుల లావాదేవీలు జరపడం, పెండ్లి ప్రయత్నాలందు అనుకూలత ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పనులు అనుకున్న విధంగా జరుగుతున్నా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వ్యాపారవృద్ధికి, వృత్తి పరంగా పెరుగుదలకు క్రొత్త పథకాలతో ముందుకు సాగుతారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. అనవసర విషయాలలో జోక్యం పనికిరాదు. విలువైన వస్తువాహనాలు సమకూర్చుకొంటారు. పెట్టుబడులకు అవకాశాలు, షేర్ల యందు లాభాలుంటాయి. ముఖ్య కాగితాలు, విలువైన వస్తువులను జాగ్రత్త పరచుకొనండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయము కొద్దిగా పెరుగుతుంది. అనుకున్న పనులు ఆటంకాలతో జరుగుతాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. షేర్ల మీద స్వల్ప లాభాలు, రావలసిన బాకీలు కొంత లభించడం, శుభవార్త వినడం, దూరప్రయాణాలు నిర్ణయం కావడం జరుగుతుంది.

# వైకాపా ఎమ్మెల్యేలను దేశంలో చేర్చిన జగన్

శ్రీను గల్పిక

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో వున్న హైదరాబాద్‌లో ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం. నారా లోకేష్ తన కొడుకు దేవాన్ష్‌తో ఆడుకుంటూ యువసామ్రాట్ నాగార్జున హీరోగా నటించిన 'రక్షకుడు' సినిమా చూస్తున్నాడు. ఆ సినిమాలో ఒక పారిశ్రామికవేత్తకు ముగ్గురు భార్యలు. వారికి ముగ్గురు కొడుకులు. వారిలో పెద్దవాళ్లయిన గిరీష్‌కర్నాడ్, రఘువరన్‌లు కలిసి మూడోవాడిని చంపడానికి ప్లాన్ చేస్తారు. అంటే ముగ్గురు ఆస్తి ఇద్దరిదవుతుందన్నమాట. అందుకే రఘువరన్ స్విమ్మింగ్ ఫూల్‌లో ఈతకొడుతున్న మూడోవాడిని చంపేస్తాడు. ఈలోపు పెద్దవాడైన గిరీష్‌కర్నాడ్ పోలీసులుకు ఫోన్ చేసి హత్య కేసులో రఘువరన్‌ను అరెస్ట్ చేయిస్తాడు. అప్పుడు రఘువరన్‌ను ఉద్దేశించి, గిరీష్‌కర్నాడ్... నువ్వు మూడును రెండు చేయాలనుకున్నావు, నేను రెండు ఒకటి చేయాలనుకున్నాను అని అంటాడు. అంటే ముగ్గురి ఆస్థిని ఒక్కడే కొట్టేయడం అన్నమాట! ఈ డైలాగ్ నారా లోకేష్‌లో సరికొత్త ఆలోచనలను రేకెత్తించింది. ఈ డైలాగ్ ఆస్తులకే కాదు, అధికారంకు కూడా వర్తిస్తుంది కదా అని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా తన తండ్రి హైటెక్‌రత్న చంద్రబాబుకు ఫోన్ చేసి... డాడీ, ఇంతకుముందు ఏపిలో ఐదు పార్టీలుండగా ఇప్పుడు మూడే అయ్యాయి. ఇప్పుడు మూడుని ఒకటి చేస్తే శాశ్వతంగా అధికారం మనదే కదా అని చెప్పాడు. నువ్వు చెప్పింది బాగానే వుంది. మరి మూడును ఒకటి చేయడం ఎలా అని చంద్రబాబు అడిగాడు. అదేముంది డాడీ, బీజేపీ ఎలాగూ మనతోనే వుంటుంది. వైకాపా ఎమ్మెల్యేలందరినీ లాగేసుకుంటే ఏపిలో మనదొక్కటే పార్టీ కదా! ఎన్నికలు కూడా లేకుంటే మనకే ఏకగ్రీవంగా అధికారం వస్తుంటుందన్నాడు. తన కుమారుడి తెలివితేటలు చూసి చంద్రబాబుకు ఆనందంతో కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. వీడు ఈ వయసులో ఇంతగా ఆలోచిస్తున్నాడంటే... నా వయసు వచ్చేసరికి ఖచ్చితంగా ఈ దేశానికి ప్రధాని అవుతాడని అనుకుంటూ... నీ ఇష్టం రా, నీకు ఎలా నచ్చితే అలా చెయ్ అని లోకేష్‌తో చెప్పాడు. దాంతో లోకేష్ ఆకర్ష్ యాక్షన్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టాడు.

భూమా నాగిరెడ్డి, అఖిలప్రియ, జలీల్‌ఖాన్, దేవగుడి ఆదినారాయణరెడ్డి, జయరాములు, దేవిడ్‌రాజు, మణిగాంధీ, జ్యోతుల నెహ్రూ, పాశం సునీల్, చాంద్ బాషా... నారా లోకేష్ యాక్షన్ ప్లాన్‌తో పాటు కమర్షియల్ ప్లాన్‌కు ఆకర్షితులై తెలుగుదేశంలో చేరారు. కట్టలు కట్టుకుని వైకాపా ఎమ్మెల్యేలు వచ్చి చేరుతుండడంతో చంద్రబాబు, లోకేష్‌లతో పాటు తెలుగుదేశం మంత్రులందరూ ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు. లోకేష్ చెప్పినట్లు మూడు ఒకటి కావడం ఎంతోదూరంలో లేదని ఆనందపడసాగారు. 'ఏపిలో ఎమ్మెల్యేలను కొంటున్న అధికారపార్టీ..', 'ఒక్కో ఎమ్మెల్యేకు 10 నుండి 30కోట్ల బేరం..' వంటి వార్తలు న్యూస్ ఛానెల్స్‌లో, పత్రికల్లో వచ్చాయి.

★★★★★

ఎన్టీవర్ భవన్‌లో చంద్రబాబు తన మంత్రులు పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వర రావు, సిఆర్‌డిఏ ఛైర్మెన్ శ్రీకాంత్‌లతో సమావేశమై ఉన్నారు. అమరావతి రాజధాని కోసం ఇప్పటికి 50దేశాల ప్లాన్‌లు తెప్పించాం. ప్రపంచంలో ఇంకా 150దేశాలున్నాయి. ఆ దేశాల ప్లాన్‌లు కూడా తెప్పించండి, అవన్నీ వచ్చాక వాటిలో ఒకటి సెలెక్ట్ చేసి రాజధాని కడదామని చెప్పాడు చంద్రబాబు. అలాగైతే ఒక స్పెషల్ ఫ్లైట్ పెట్టుకుని నేను అన్ని దేశాలకు వెళ్లి ప్లాన్‌లు కలెక్ట్ చేసుకుని వస్తానని నారాయణ అన్నాడు. అంతలో పి.ఏ లోపలకు వచ్చి, సార్, మిమ్మల్ని కలవడానికి తమిళనాడు నుండి డిఎంకె ఎమ్మెల్యేలు వచ్చారని చెప్పాడు. తమిళ నాడు ఎమ్మెల్యేలకు మనతో పనేంటబ్బా... మన పరిపాలనా విధానాలు నచ్చి అవి తెలుసుకోవడానికి వచ్చుంటారని మన సులో అనుకుని లోపలకు పంపించమని చెప్పాడు చంద్రబాబు. వెంటనే 10మంది తమిళనాడు ఎమ్మెల్యేలు లోపలకు వచ్చారు. చంద్రబాబు వారితో... చెప్పండి నేను మీకు ఏ విధంగా సాయపడగలను అని అడిగాడు. దానికి వారిలో తంబిదురై వుండి... సార్, మేము మీ పార్టీలో చేరాలని వచ్చాం. మీ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు ఏదో ఆఫర్స్ ఉన్నాయంట కదా... మాక్కూడా ఆ ఆఫర్స్‌ను ఇవ్వండి అని అడిగాడు. మా పార్టీ ఆఫర్స్ ఆపరేషన్ ఇంత పాపులారిటీ అయ్యిందా... అని చంద్రబాబు ఆలోచనలో పడ్డాడు. అంతలో చంద్రబాబు సెల్‌ఫోన్ మోగింది. బాబు ఫోన్ ఎత్తాడు. అవతల కంఠం... సార్, నేను ఒరిస్సా నుండి ఎమ్మెల్యే గోవిందగోస్వామిని మాట్లాడుతున్నాను, మీ పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యేలకు మంచి మంచి బహుమతులిస్తున్నారని విన్నాను, నేను కూడా మీ పార్టీలో చేరతాను, ఆ బహుమతులేవో నాకు ఇవ్వండి అని కోరాడు. అంతలో మళ్లీ పి.ఏ లోపలకు వచ్చి... సార్, జమ్ము, కాశ్మీర్ నుండి పిడిపి ఎమ్మెల్యేలు నలుగురు, కేరళ నుండి సిపిఎం ఎమ్మెల్యేలు 10మంది, కర్నాటక నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డజను మంది వచ్చి ఉన్నారని చెప్పాడు. చంద్రబాబు వారందరినీ లోపలకు పిలిపించాడు. అందరు కూడా... సార్, మీ ఆఫర్స్ మాకు నచ్చాయి. మీ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి 20కోట్లు ఇస్తున్నారట కదా... 'సాక్షి' పత్రికలో చూసాము, మేం ఎన్ని సార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసినా అంత డబ్బును సంపాదించుకోలేము. మమ్మల్ని కూడా మీ పార్టీలో చేర్చుకుని ఆ డబ్బులేవో ఇప్పించండి సార్, మీ పేరు చెప్పుకుని బ్రతుకుతాము, మా రాష్ట్రాల్లో మీ పార్టీ అభ్యర్థులుగానే పోటీ చేస్తాం... అని మొరపెట్టుకోసాగారు. కొందరు ఎమ్మెల్యేలైతే చంద్రబాబును గడ్డం పట్టుకుని బ్రతిమలాడసాగారు. వీళ్లు ఇలా బ్రతిమలాడుతున్న సమయంలోనే చత్తీష్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, త్రిపుర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేలు కూడా వచ్చారు. సార్, సాక్షి పేపర్‌లో చెప్పినంత కాకున్నా అందులో సగం ఇవ్వండి చాలు... మేం మీ పార్టీలో చేరడానికి సిద్ధంగా వున్నామని, ప్రాంతీయ బేధంతో తమను వద్దని చెప్పవద్దని వేడుకోసాగారు. వివిధ రాష్ట్రాల నుండి వందల మంది ఎమ్మెల్యేలు ఒక్కసారిగా వచ్చి పడడంతో చంద్రబాబుకు దిక్కుతోచలేదు. మీకు దండం పెడతా, ఈ ఆపరేషన్ కేవలం వైకాపా ఎమ్మెల్యేల కోసమే.. ఇంకెవరికీ వర్తించదు... మిమ్మల్ని మా పార్టీలో చేర్చుకుంటే నాకు ఒరిగేదేమిటి... కేవలం నాకు వైకాపా ఎమ్మెల్యేలే కావాలి... అని బిగ్గరగా అరిచాడు. అప్పుడు వెనుక నుండి... వైకాపా వాళ్లు నీకు ఎంతమంది కావాలని ఓ గొంతు అరిచింది. చంద్రబాబు ఆ వైపు చూసాడు. ఎదురుగా వైకాపా అధినేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి నిలబడి ఉన్నాడు.

(ఇంకా వుంది)

# కల్యాణ వైభవం...!




ప్రముఖ కవి నాగభైరవ కోటేశ్వరరావు మనుమరాలు, సినీ దర్శకులు నాగభైరవ వీరబాబు - పద్మజల కుమార్తె **ఐశ్వర్య రత్న - పార్థసారథి** (గుంటూరు జిల్లా ధూళిపూడి వాస్తవ్యులు కొల్లి లక్ష్మీదేవి, స్వర్గీయ శ్రీహరిబాబుల కుమారుడు)ల కల్యాణం ఏప్రిల్ 21వ తేదీ హైదరాబాద్‌లోని శ్వేత గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు వై.టి.నాయుడు సోదరుడు యేదుపాటి బుజ్జయ్య - నాగవేణిల కుమార్తె **రేవతి - సుబ్రహ్మణ్య స్వామి** (మాధవరపు నాగభూషణం - హైమావతిల కుమారుడు)ల పెళ్లి ఏప్రిల్ 22వ తేదీ నెల్లూరులోని పావని గార్డెన్స్ నందు జరిగింది. పలువురు ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు విచ్చేసి నూతన దంపతులను దీవించారు. కొత్తజంటకు 'లాయర్' దీవెనెలు.



శ్రీ సర్వోదయ కళాశాల వ్యవస్థాపకులు స్వర్గీయ సి.సి.సుబ్బరాయులుశెట్టి మనుమడు, హ్యాపిహోమ్ అధినేత చిన్ని సుబ్బారావు - పద్మశ్రీల కుమారుడు **కార్తిక్ - ఇంద్రజా ప్రియాంక** (కాకినాడ వాస్తవ్యులు పులవర్తి రాంకుమార్ - మాలతిల కుమార్తె)ల వివాహం ఏప్రిల్ 17వ తేదీ కాకినాడలోని ఎస్ఆర్ఎంటి కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు పత్రికా రంగంలో సీనియర్ ప్రకటనల సేకరణ కర్త రాజారాం భగవాన్‌సింగ్ సోదరుడు శ్రీనివాస సింగ్ - శివలలిత జ్యోతిల కుమార్తె **చందన - మధుబాబు** (కర్నూలు జిల్లా కోయిలకుంట్ల వాస్తవ్యులు స్వర్గీయ ఎం.కుళ్లాయిబాబు - జయలక్ష్మిల కుమారుడు)ల పరిణయం ఏప్రిల్ 22వ తేదీ నెల్లూరులోని రాఘవ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



# కావలి కబుర్లు

## శ్రీచైతన్య విద్యార్థులను అభినందించిన బీద



విద్యార్థులకు నగదు బహుమతి అందచేసి అభినందిస్తున్న బీద మస్తాన్‌రావు

పట్టణంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు టౌన్ రికార్డు మార్కులు సాధించినందుకు గాను మాజీ శాసన సభ్యులు, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు వారిని అభినందించారు. ఎంపిసిలో కె.లహరి 989, రమ్యతేజస్విని 988, హరిప్రియ 988, బైపిసి గ్రూపులో 981 మార్కులు సాధించిన ఎన్‌కె అఫ్రీన్‌కు, ఎమ్ఈసి గ్రూపులో ఎన్ పూర్ణిమ 956 మార్కులు సాధించినందుకు.. 5000, 2500 రూపాయల నగదు బహుమతిని, జూనియర్ ఇంటర్‌లో ఎస్‌కె షర్మిలా 464, ఆర్‌విసి జ్యోత్స్న 464 ఎంపిసి గ్రూపు; సిఈసి లో ఎస్‌కె హబిమున్నీసా 469 మార్కులు పొందినందుకు ఒక్కొక్కరికి రూ॥ 1000 చొప్పున నగదు బహుమతిని అందించి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమములో కళాశాల యాజమాన్యం, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా ఆర్.సీ పాళెం

### - పంచాయితీ రాజ్ దినోత్సవంలో కందుకూరి





ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్‌లో బాగంగా రాజువారీ చింతల పాళెం గ్రామం 100శాతం మరుగు దొడ్లను నిర్మించుకొని ఆదర్శ గ్రామంగా నిలిచిందని బా.జా.పా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి వెంకట సత్యన్నారాయణ అన్నారు. ఆదివారం జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా రూరల్ మండలం ఆర్.సీ పాళెం లో ఏర్పాటు చేసిన కార్యమ్రంలో ఆయన పాల్గొని ఉపన్యసించారు. ఆర్.సీ పాళెంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలన్నీ వినియోగించుకుందని అన్నారు. ఈ గ్రామంలో ఉత్సాహవంతులైన వారికి చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు భాజాపా సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సివిసి సత్యం, ట్రెజరర్ సంగమేశ్వరరావు, రూరల్ మండలాధ్యక్షులు నరేంద్ర, ప్రసాద్, సర్పంచ్ మల్లిఖార్జున, యాకోబు, ఎంపిటీసి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌ను నెల పొడవునా ఇవ్వాలి

కావలి తహసీల్దారు కార్యాలయములో సోమవారం సిపిఐ(ఎమ్) నాయకులు, కార్యకర్తలు నెలపొడవునా రేషన్ అందించాలని స్థానిక తహసీల్దార్ కె సాంబశివరావుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎమ్) సభ్యులు మాట్లాడుతూ వేలి ముద్రలు వేసే సమయంలో సరిగా ముద్రలు పడక డీలర్ల చుట్టూ తిరిగి తిరిగి వినియోగదారులు రోజువారీ పనులు పోగొట్టుకుంటున్నారన్నారు. దీంతో వచ్చే రేషన్‌ను పోగొట్టుకోవలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన ఈ-పాస్ విధానం ఏ లోపం లేకుండా సక్రమంగా పనిచేసేలా ప్రభుత్వం చూడాలని అన్నారు. ప్రభుత్వం నెలలో 3రోజులు మాత్రమే సరుకులు ఇస్తానని చెప్పడం సరికాదని చౌకడిపోలలో ఇచ్చే రేషన్‌ను నెల పొడవునా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్నపూర్ణ అంత్యోదయ కార్డులకు ఇస్తున్న 35కేజిల బియ్యం 10 కేజీలకు కుదించి ఇస్తున్నారని ఈ విధానం సరికాదని అన్నారు. రానురాను కార్డులకు కూడా మంగళం పాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. ఈ-పాస్ విధానం సక్రమంగా నిర్వహించేందుకు జిల్లాకొక సర్వర్ పెట్టాలని అన్నారు. వృద్ధులకు, వికలాంగులకు వేలిముద్రలతో పనిలేకుండా రేషన్ ఇచ్చే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సర్వర్లు పని చేయకపోతే వెంటనే ప్రత్యామ్నాయమైన ఏర్పాటు చేసి సరుకులు ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ కార్మికులకు ఇతర పేదలకు 60 సం॥ ల వయస్సు ఉన్నవారికి అందరికి వృద్ధాప్యపు పెన్షన్‌లు ఇవ్వాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు టి.మాల్యాద్రి, సిఐటియు సభ్యులు పి పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు బి వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే యూజర్స్ సభ్యుడిగా కామయ్య



విజయవాడ రైల్వే డివిజన్ యూజర్స్ కన్సల్టేటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నెల్లూరు జిల్లా కావలికి చెందిన వైయస్సార్సీపీ నాయకులు కుందుర్తి కామయ్యను నియమిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సిఫార్స్ మేరకు రైల్వే అధికారులు కామయ్యను డిఆర్‌యుసిసి సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా కామయ్య మాట్లాడుతూ తనను నమ్మి ఈ పదవి ఇచ్చినందుకు ఎంపి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కావలి రైల్వేస్టేషన్లో ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

# ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు





ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్‌కు అనుబంధ సంస్థగా ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆవిర్భావ సభ నెల్లూరు పాత జిల్లా పరిషత్ సమావేశమందిరంలో సోమవారం జరిగింది. ఈ సభకు ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఆంధ్రభూమి ఎడిషన్ ఇన్‌ఛార్జ్ సంపత్‌కుమార్, ఆంధ్రప్రభ బ్యూరో ఇన్‌ఛార్జ్ వి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జర్నలిస్ట్ అంటే వ్యక్తి కాదు, శక్తని జర్నలిస్ట్‌లందరూ ఐక్యంగా ఉంటే ఎలాంటి పనైనా సాధించవచ్చున్నారు. దానికి నిదర్శనమే ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆవిర్భావమన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇజెఎ జిల్లా గౌరవాధ్యక్షులుగా శింగరాజు రామారావు, అధ్యక్షులుగా సర్వేపల్లి రామమూర్తి, ఉపాధ్యక్షులుగా షేక్ రఫి, జి.ప్రతాప్, పి.నరసింహారావు, ఎ.పూర్ణప్రకాష్, టి.శోభన్‌బాబు, పి.రాజారావు, జనరల్ సెక్రటరీగా కె.జె.చంద్రబోస్, జాయింట్ సెక్రటరీగా డి.మురళీమోహన్‌రావు, గద్దం హనోక్, జె.మహేష్, పి.బాబురావు, వి.హజరత్తయ్య, ట్రెజరర్‌గా ఎం.రాజేంద్రప్రసాద్, కార్యనిర్వాహక సభ్యులుగా పి.విజయకుమార్, టి.గోపినాథ్, బి.విజయమోహన్, డి.రవి, ఎ.బాలాజి, ఎం.శ్రేక్షిత్‌కుమార్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# గ్లోబెల్ ప్రచారం మానుకోవాలి

రాష్ట్రంలో అధికారపార్టీలోని కొందరు నేతలు కేంద్రం నుంచి సహాయం అందడం లేదని, ఏమీ చేయడం లేదని గ్లోబెల్ ప్రచారం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి హితవు పలికారు. నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాల ప్రచారంలో కనీసం ప్రధాని ఫోటో లేకపోయినా తాము అడగడం లేదని, రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పుతుంటే దానిని సరిచేసుకోకుండా తమ పార్టీ నేతల గురించి, కేంద్రప్రభుత్వం గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో శ్రీను, రాధాకృష్ణ, కోటేశ్వరరావు, వంశీధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### తిక్కవరపు కోదండరామిరెడ్డి



నెల్లూరుజిల్లాలో మొదటితరం ఇంజనీర్, ఎన్నో కట్టడాల రూపశిల్పి తిక్కవరపు కోదండరామిరెడ్డి ఏప్రిల్ 25వ తేదీన తన 93వ యేట కనుమూశారు. ఆయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. 1942లోనే ఆయన ఇంజనీరింగ్ పట్టభద్రులయ్యారు. పల్లెపాడులోని గాంధీ ఆశ్రమం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. 1948లోనే నెల్లూరులో చిన్న తరహా పరిశ్రమను నెలకొల్పి పారిశ్రామిక ప్రగతికి పునాది వేశారు. నెల్లూరుజిల్లా నుండి పారిశ్రామికంగా మైకా ఎగుమతి తప్ప ఇంకేమీ లేని రోజుల్లో ఆంధ్రా బోన్‌మిల్ పరిశ్రమను స్థాపించి మృత పశువుల ఎముకల ద్వారా జెనెటిల్ అనే కెమికల్ తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేయించారు. పెస్టిసైడ్స్ తయారీకి ఈ కెమికల్‌ను ఉపయోగించేవాళ్లు. నెల్లూరుజిల్లాలో పాతతరం ఇంజనీర్లలో చెప్పుకోతగ్గ మేధావి కోదండరామిరెడ్డి. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### మేనకూరు వెంకటరమణారెడ్డి



నెల్లూరుజిల్లాలో అత్యంత సీనియర్ న్యాయవాది, ఎన్నో కీలకమైన కేసుల్లో విజయాలు సాధించిన న్యాయ నిపుణులు స్వర్గీయ మేనకూరు ఆదిశేషారెడ్డి కుమారుడు మేనకూరు వెంకటరమణారెడ్డి ఏప్రిల్ 27వ తేదీ తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 85 సంవత్సరాలు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మేనకూరు ఆదిశేషారెడ్డి అంటే నెల్లూరుజిల్లాలో తెలియనివారు ఉండరు. ఆయన కుమారుడు వెంకటరమణారెడ్డి ఆటోమొబైల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి న్యూ ఇండియా అస్యూరెన్స్ లిమిటెడ్‌లో కొంత కాలం మేనేజర్‌గా పని చేశారు. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయ రంగంలో స్థిరపడ్డారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17న అంకురార్పణతో ప్రారంభమై 27వ తేదీ ఏకాంత సేవ(అవరోహణం)తో వైభవంగా ముగిశాయి. ప్రతి రోజూ శ్రీ స్వామివారికి ఉదయం సూర్య ప్రభ, యాళి ఉత్సవము(సింహవాహనము), చప్పరము, మోహిని(గిన్నెభిక్ష), రథోత్సవం, వెన్నెతాళి ఉత్సవము, తీర్థవాది(ముసుగుల సేవ), చక్రస్నానం కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. ప్రతిరోజూ 7గంటలకు శేషవాహనం, హంసవాహనం, చంద్రప్రభ, వెండి హనుమంత సేవ, గరుడసేవ, కళ్యాణం, గజవాహనం, పుష్పకవిమాన అలంకారం, అశ్వవాహనం, పొన్న వాహనం, ఏకాంత సేవ కార్యక్రమాలు కనుల విందుగా జరిగాయి. ప్రతిరోజూ సాయంత్రం వివిధ కళాసంస్థలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు ఈ కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించి శ్రీ స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ గిరి కృష్ణ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# ఉర్రూతలూగించిన నర్సింగ్ విద్యార్థినుల నృత్యం



నెల్లూరు పొదలకూరురోడ్డులోని సెయింట్ జోసెఫ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వార్షికోత్సవ సంబరాలు ఈ నెల 22 నుంచి నర్సింగ్ కాలేజీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఫ్యాన్సీ డ్రస్సు, పాటల పోటీలు, క్విజ్, హెయిర్ స్టైల్ పోటీలను నిర్వహించారు. 27వ తేదీ రాత్రి జరిగిన సోలో, డ్యూయెట్, గ్రూప్ డాన్స్‌ల పోటీల్లో నర్సింగ్ విద్యార్థినులు ఒకరికొకరు పోటాపోటీగా తమ ప్రదర్శనలు నిర్వహించి ఉర్రూతలూగించారు. ఈ పోటీల్లో సోలో డ్యాన్స్‌లో 8మంది విద్యార్థినులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా శాప్న, ప్రశాంతి, సుమంత గెలుపొందారు. డ్యూయెట్ పోటీల్లో 8మంది పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా వినీత-శాప్న, సుమంత-ప్రియ, ఝాన్సీ-మహేశ్వరిలు కైవసం చేసుకున్నారు. గ్రూప్ డ్యాన్స్ పోటీల్లో 4గ్రూపులు పాల్గొనగా మొదటి, రెండవ, మూడవ బహుమతులను వరుసగా డెఫ్ఫోడిల్స్ గ్రూప్, తులిప్స్ గ్రూప్, బ్లూబెల్స్ గ్రూపులు సాధించాయి. డ్యాన్స్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా మనుబోలు ప్రభాకరరావు, ఎన్.వి.రమణయ్యలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ సిస్టర్ మరియమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు. 28వ తేదీ మిస్ సెయింట్ జోసఫ్స్ అందాల పోటీలతో కార్యక్రమాలు ముగిశాయి.

# సేవ్.. వైకాపా!

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారు. ఆయన వై.యస్. ఇంట్లో మనిషి. ఆయనకు బదులు పార్టీకి రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచిన ఎం.వి.మైసూరారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వంటి వారిని పరిగణనలోకి తీసుకుని వుండాలి. కాని అలా చేయకపోవడం వల్లే వీళ్లు సైతం పార్టీ వదిలిపోయారు.

సేవ్ డెమోక్రసీ అంటూ జగన్ ఢిల్లీ వీధుల్లో వెలుగెత్తి అరిచినంత మాత్రాన అక్కడ ప్రజాస్వామ్యాన్ని కాపాడే వాళ్లెవరూ లేరు. భారత దేశ రాజకీయమే ప్రజాస్వామ్యం ముసుగులో వున్న దొంగల రాజ్యం. ఇక్కడ అందరూ దొంగలే! కాబట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడే మాట పక్కన పెట్టి జగన్ ముందు తన పార్టీని కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలి.

# నెల్లూరు నుండి ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

ఇంతవరకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాత్రమే తెలుగుదేశంలోకి వెళ్లాడు. మేకపాటి గౌతమ్‌రెడ్డి జగన్‌కు అత్యంత సన్నిహితుడు. ఆయన మీద ప్రస్తుతానికి అనుమానాలు లేవు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు జగన్ పట్ల విశ్వాసంతో వున్నారు. ఇక తెలుగుదేశం నాయకులు సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్యకు గాలం వేశారు. అయితే అతను విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనంలా నిలిచాడు. ఉద్యోగం వదులుకుని వస్తే నాకు సీటిచ్చి ఎమ్మెల్యేను చేసింది జగన్. నేను పార్టీ మారే ప్రసక్తే లేదు. ఒకవేళ పార్టీ మార్చాల్సి వస్తే ఎమ్మెల్యే పదవినే వదులుకుంటానని చెప్పి, రాజకీయాలలో ఇంకా అంతో ఇంతో నైతిక విలువలు బ్రతికి వున్నాయని చాటాడు. ఉన్న సందేహమల్లా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిల పైనే! వీళ్లిద్దరి మీద ఎన్నికల నాటి నకిలీ మద్యం కేసులున్నాయి. వీటిని మొదటి నుండి బూచిగా చూపించి వాళ్లను లాగేసుకునేందుకు తెదేపా నాయకులు చాలాకాలంగా ప్రయత్నాలు జరుపుతూనే వున్నారు. వీరిద్దరితోనూ 'దేశం' నేతలు చర్చలు జరిపినట్లు సమాచారం. కేసుల దెబ్బకు భయపడితే వీళ్లు వైకాపాను వీడే అవకాశాలను కొట్టిపారేయలేము.

# ఏ రెడ్డిని వరిస్తుందో?

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ మంత్రిగా ఉంటే అందరిలో ఒకడు. అదే ప్రభుత్వ ప్రధాన సలహాదారు అయితే చంద్రబాబు తర్వాత అంత హోదా అన్న పేరొస్తుంది. అందరు మంత్రులపై కూడా అజమాయిషీ చేయొచ్చు. మంత్రిగా ఫెయిలైనాడని, ఏ పని చేయలేకపోతున్నాడనే ఆరోపణలు తప్పుతాయి. ఆయనను మంత్రివర్గం నుండి తప్పిస్తే నెల్లూరుజిల్లా నుండి పార్టీని నడిపించేవాళ్లకు మంత్రి పదవి అప్పగించవచ్చు.

ఈ కోణంలో చూస్తే క్యాబినెట్ విస్తరణలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి, మాగుంట శ్రీనివాసులురెడ్డికి అవకాశాలు మెరుగయ్యాయి. అయితే ఇద్దరిలో ఒకరికే ఛాన్స్ వుంటుందా లేక ఇద్దరికీ దక్కుతుందా? అన్నది చూడాలి. ఈమధ్య కాలంలో చూస్తే జిల్లాలో తెలుగుదేశం పార్టీకి సోమిరెడ్డి అవసరం బాగా కనిపిస్తోంది. లీడర్‌లను, కేడర్‌ను ఏకతాటిపైకి తేగల పచ్చి పొలిటీషియన్ సోమిరెడ్డి. ప్రభుత్వానికి పాజిటివ్‌గా మాట్లాడి ప్రజలను మెప్పించడంలోనూ, ప్రతిపక్షంపై ఆధారాలతో కూడిన విమర్శలు చేయడంలోనూ సోమిరెడ్డి సిద్ధహస్తుడు. జిల్లా పార్టీలో అధిక శాతం కార్యకర్తలు సోమిరెడ్డినే మంత్రిగా కోరుకుంటున్నారు. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు పార్టీ కోసం కష్టపడింది సోమిరెడ్డేనన్న అభిప్రాయం కూడా కేడర్‌లో వ్యక్తమవుతోంది. క్యాబినెట్ విస్తరణలో రెడ్లకు పెద్దపీట వేసే దృష్ట్యా సోమిరెడ్డికి అవకాశాలు మెరుగ్గా వుండగా, మధ్యలో మాగుంట శ్రీనివాసులురెడ్డికి కూడా మంత్రి పదవి ఖాయమనే వార్తలొస్తున్నాయి. మాగుంట ప్రకాశం జిల్లా నుండి ఎమ్మెల్సీగా వున్నారు. ఏ జిల్లా ప్రజాప్రతినిధులను ఆ జిల్లా వరకు లెక్కలోకి తీసుకుంటే సోమిరెడ్డి అవకాశాలు సజీవంగా వుంటాయి. అలాకాకుండా మాగుంట శీనయ్యను నెల్లూరు లెక్కలోకి తీసుకుంటే సోమిరెడ్డికి తలనొప్పే! ఎందుకంటే జిల్లా నుండి ఒక రెడ్డికి మాత్రమే ఛాన్సుంటుంది. మాగుంట శీనయ్యను తీసుకోవాలనుకుంటే మాత్రం నెల్లూరు జిల్లాలో సోమిరెడ్డిని పక్కన పెట్టి బీద రవిచంద్ర పేరును కూడా పరిశీలించే అవకాశముంది.

• సక్సెస్ 33

# విజయం పరిపూర్ణం

**పిఎస్ఎల్వి సిరీస్‌లో రాకెట్లను విజయవంతం చేయడమంటే శెనగలు తిని చేతులు కడుక్కున్నంత సులభంగా మారింది ఇస్రో వాళ్ళకు. గతంలో ఏ రాకెట్‌ను ప్రయోగిస్తున్నా శాస్త్రవేత్తల్లో టెన్షన్ కనిపించేది. నాలుగో దశ విజయవంతమయ్యే వరకు వాళ్ల గుండెలు వేగంగా కొట్టుకుంటుండేవి.**



ఇప్పుడు అలాంటి పరిస్థితి మారింది. పిఎస్ఎల్వి ప్రయోగాలు సక్సెస్‌కు చిరునామాగా మారాయి. ఇస్రో శాస్త్రవేత్తల నమ్మకాన్ని నూరుశాతం నిలబెడుతూ పిఎస్ఎల్వి సిరీస్‌లో ప్రయోగాలు విజయవంతమవుతున్నాయి. ఈ పరంపరలోనే ఇస్రో ఖాతాలో మరో విజయం జమయ్యింది.

ఏప్రిల్ 28వ తేదీ శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్) నుండి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి33 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. మధ్యాహ్నం 12.50 గంటలకు నిప్పులు విరజిమ్ముతూ నింగిని చీల్చుకుంటూ పిఎస్ఎల్వి-సి33 దూసుకుపోయింది. మొత్తం 19 నిముషాల 42సెంకడ్లలో ప్రయోగం పూర్తయ్యింది. దేశీయ నేవిగేషన్ వ్యవస్థ కోసం ఇస్రో రూపొందించిన 1425కిలోల బరువు గల ఐఎన్ఆర్ఎస్ఎస్-1జి ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్‌తో పాటు భారత త్రివిధ దళాల అధిపతి అరూప్‌రహా కూడా ఈ ప్రయోగాన్ని వీక్షించడం విశేషం. ప్రయోగం విజయవంతం కాగానే శాస్త్రవేత్తలు ఒకర్నొకరు ఆలింగనం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు. భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోడీలు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

## పూర్తయిన నావిగేషన్ ప్రయోగాలు:

సొంత నావిగేషన్ వ్యవస్థ కోసం ఇస్రో చేసిన 7ఉపగ్రహ ప్రయోగాలు పూర్తిగా విజయవంతమయ్యాయి. దీంతో భారత్‌కు సంపూర్ణ నావిగేషన్ వ్యవస్థ ఏర్పాటైంది. గతంలో పిఎస్ఎల్వి సిరీస్ ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్ 1ఎ, 1బి, 1సి, 1డి, 1ఇ, 1ఎఫ్ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించడం తెలిసిందే! 2013జూలై 2వ తేదీ నుండి మొదలైన నావిగేషన్ ఉపగ్రహాల ప్రయోగం గురువారంతో ముగిసింది. ఐఆర్ఎన్ఎస్ఎస్ ఉపగ్రహాల నుండి రెండు రకాల సేవలను పొందవచ్చు. స్టాండార్డ్ పొజిషనింగ్ సిస్టం ద్వారా అందరికీ సేవలందుతుంటాయి. అలాగే నిర్దేశించిన వ్యక్తులు, వ్యవస్థలకు గోప్యంగా సమాచారం అందిస్తుంది. విమానాలు, నౌకలకు ఈ వ్యవస్థ ద్వారా దిశా నిర్దేశం జరుగనుంది. అలాగే ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన నిర్ధిష్ట సమాచారం లభిస్తుంది. ఏ వాహనం ఎక్కడుందో పసి గట్టగల జిపిఎస్ సిస్టం అందుబాటులో వుంటుంది. మొబైల్ ఫోన్‌లలో ఇంటిగ్రేషన్ కోసం కూడా ఇది ఉపయోగపడుతుంది.

1999లో కార్గిల్ యుద్ధ సమయంలో పాక్ బలగాలు, ఉగ్రవాదుల కలయికలపై జిపిఎస్ సమాచారం ఇవ్వాలని భారత్, అమెరికాను కోరింది. అందుకు అమెరికా నిరాకరించడంతో సొంత నావిగేషన్ కోసం ఇస్రో ఆరోజు నుండే శ్రీకారం చుట్టింది. ఈ 17ఏళ్ళలో తీవ్రంగా శ్రమించి అగ్రరాజ్యాలకు ధీటుగా అతితక్కువ ఖర్చుతో సొంత నావిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయగలిగింది. శెభాష్... ఇస్రో!



దూరదర్శన్ ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ


ACT లో

లాయర్ శ్రీరామ నవమి సంబరాలు

తేది. 15.04.2016న నెల్లూరు పురమందిరంలో ఎంతో వేడుకగా నిర్వహించిన లాయర్ పెళ్ళిపుస్తకం ఆవిష్కరణ, స్వర్ణోత్సవ దంపతులకు వేదపండితుల ఆశీర్వచనం మరియు శ్రీరామనవమి సంబరాలను ఏప్రిల్ 30వ తేదీ శనివారం సాయంత్రం 7గంటలకు, తిరిగి మే1వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు

UR CHOICE యువర్ ఛాయ్స్ నందు చూసి ఆనందించగలరు. సం/-








Mondelēz International

SRI CITY
An Integrated Business City

ISUZU



ఏప్రిల్ 25, 27 తేదీలలో శ్రీసిటీలో...
మోండెలేజ్ మరియు ఇసుజు కర్మాగారాలను
ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
మా కృతజ్ఞతాపూర్వక అభివందనాలు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com